22-6-54

నాలుగు పేజీలు ఐ.జి0-1-0

గోలకొండ పత్రిక

తెలంగాణమునుండి వెలువడు ఏకైక జాతీయ దినపత్రిక

ఫోన్ నెం. 4280

హైద్రాబాద్ 22-6-54 మంగళవారం

గోలకొండ పత్రిక
సంవత్సర చందా ఐ.జి. రు. 25-0-0
ఆరుమాసముల చందా „ „ 13-0-0
మూడు మాసముల „ „ „ 6-12-0

మూడు మాసములకు తక్కువ చందా తీసికొనబడదు.

మేనేజరు
గోలకొండ పత్రిక

సాపితము 1925
రిజిష్టరు నెం. 45

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి ఎం.ఏ.

సంపుటము 7
సంచిక 143

100333

ASAFIYAH STATE LIBRARY HYDERABAD

వైద్యసదుపాయాల కల్పన ప్రణాళిక

న్యూఢిల్లీ, జూన్ 21

ఇండియా ప్రభుత్వం వైద్యసదుపాయాల కల్పన ప్రణాళికను 1954 జూలై 1 వ తేదీన ప్రారంభించింది. రోగనిదానం, చికిత్సలలో ఆధునిక విధానాలలో వైద్యులకు స్వల్పకాలిక శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ ప్రణాళిక ఢిల్లీలో విజయవంతమైతే ఈ ప్రణాళిక మిగతా పాంతాలలోగూడ అమలు పరచబడుతుంది.

ఉస్మానియామార్పిడికే విశ్వవిద్యాలయకమిటీ అనుకూల్యం?

రెండు రాష్ట్రాల్ని కోరడంవలన రాష్ట్రం విచ్ఛిత్తే నిలచిపోగలదు

కోదాటినారాయణరావుగారి హెచ్చరిక

(మా విశేషరి)

హయిద్రాబాద్, జూన్ 20

ఆంధ్రప్రభుత్వ ఆర్థికమంత్రి శ్రీ కొణ్ణేటి విశ్వనాథంగారు హయిద్రాబాద్ వచ్చిన సందర్భంలో విశాలాంధ్ర మహాసభవారు హయిద్రాబాద్ మేయర్ శ్రీ ధరణీధర సాంఘి అధ్యక్షతలో నేటిసాయింత్రం రాజావతా వగిర్జీ కోఠీలో యేర్పాటు చేయబడిన బహిరంగసభలో తెలంగాణాకాంగ్రెసు ప్రముఖుడు శ్రీ కోదాటి నారాయణరావుగారు ప్రసంగిస్తూ రెండు తెలుగురాష్ట్రాలనుకోరడంవలన రాష్ట్రం విచ్ఛిత్తే నిలిచిపోగల ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

శ్రీ కోదాటి ఇంకా ఇలా ప్రసంగించారు: "పి.సి.సి. తెలంగాణప్రతిధుల సమావేశంలో హయిద్రాబాద్-సికింద్రాబాద్ నగరాలు త్రిత్వ కరాష్ట్రం చేయబడాలని చెన్నారెడ్డిగారి తీర్మానానికి నేను ప్రవేశపెట్టినసవరణ ఆ విషయమై ప్రసంగించడానికి అవకాశం కోరడానికే ఉద్దేశించబడినది. అంతేగాని నేను ఉభయ నగరాలకు చీఫ్ కమీషనర్ రాష్ట్రంగా చేయాలని కోరడంలేదు. విశాలాంధ్ర రాష్ట్రి మేర్పడాలనేవారిలోనికడిని. రెండుతెలుగురాష్ట్రాలతీర్మానాన్ని ప్రవేశపెట్టిన వారికి దురుద్దేశాల నాపాదించడం లేదు. అలా ప్రవేశపెట్టే హక్కు వారికిఉంది. ఏ విధానంలాభకరమో బాగుగా ఆలోచించి ఈవిషయమై పనిచేయాలి. కాని రెండు తెలుగురాష్ట్రాలనుకోరడంవలన అసలు సంస్థానవిభజనే నిలిచిపోయే ప్రమాదము నాకు కనిపిస్తున్నది.

'ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడనైనా రెండురాష్ట్రాలతీర్మానం వస్తుందని కొద్దిరోజులకు పూర్వము వరకు నాకు తెలియదు. ఈ తీర్మానం కేవలము చాలాకాలంగా అంతర్గతంగా పనిచేస్తూ ఒక్కసారి బయటికివచ్చింది యింతటి రాజకీయ చతురతచూసి మనంగర్వపడాలి. ఇంతటి చాతుర్యం చూపిన తెలంగాణ వెనుకబడిఉందని చెప్పడం సరికాదు. ఆంధ్రరాష్ట్రంలో కూడ రాయలసీమ వెనుకబడిఉందని అంటున్నారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాలుకూడ వెనుకబడినవి. ఇకపోతే కృష్ణా, గుంటూరు, గోదావరిజిల్లాలు పున్నవి. వాటిలో కూడ కొన్నిమెరక ప్రాంతాలు పల్లపు ప్రాంతాలకంటె చాలవెనుకబడిఉన్నవి. కాని వారు భయపడినారా? ఈ విధంగా మాస్టే ప్రతిజిల్లాలోను వెనుకబడిన ప్రాంతాలంటూ ఉన్నవి. పురోగమించినఆంధ్ర రాష్ట్రంవారు వెనుకబడిన తెలంగాణాపై పెత్తనంవహిస్తారని చెప్పేవాదన నాకేమీ సమంజసంగా లేదు. ఉద్యోగాల విషయం ప్రస్తావిస్తున్నారు. అన్ని భాషల్లోను రిక్రూటిచిమెంట్లువస్తున్నవి. తొలగించబడిన వారికే ఉద్యోగాలు చూడటం కష్టమౌతుండగా అసలు క్రొత్త వారికి ఏమి ఉద్యోగాలుంటవి?

"సాంస్కృతికంగా, ఆర్థికంగా మాత్రమేగాక, రాజకీయ దృక్పథంతో చూసినా విశాలాంధ్రం యేర్పడటం లాభదాయకమనేకనిపిస్తుంది. అసలు ఈ సమస్యలో రాజకీయ దృక్పథమే ముఖ్యం. అయినా రెండు రాష్ట్రాల వాదంలో ఇమిడిఉన్న తత్వం ఏమిటో కూడ అర్థం చేసుకోవాలి. కాని యీ విధంగా కొందరు విశాలాంధ్రను, కొందరు రెండురాష్ట్రాలను కోరడంవలన అసలు సంస్థానవిభజనే జరుగకుండా పోయే ప్రమాదంఉంది. సంస్థాన విభజనే జరుగరాదంటూ కొన్ని శక్తులు ప్రచారంచేస్తున్నవి. ఈ పరిస్థితుల్లో ఆ శక్తులుబలపడే అవకాశం కనిపిస్తున్నది. రాష్ట్రాల పునర్నిర్మాణ కమిషన్ వచ్చిన ఈ సందర్భంలో మనము ఈ విభేదాలను సమన్వయపరచి ఏకకంఠంతో మన అభ్యర్థనను వినిపించాలి.

ఆంధ్రకాంగ్రెసు ప్రముఖుడు, విశాలాంధ్ర మహాసభాధ్యక్షుడయిన శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు విశాలాంధ్ర వలన తెలంగాణమునకు కలుగగల ప్రయోజనాలను వివరిస్తూ ఇలా ప్రసంగించారు:

"చరిత్రను పరిశీలిస్తే తెలుగు గడ్డఅంతా వేలాది సంవత్సరాలుగా ఏకఖండంగా ఉన్నట్లు స్పష్టపడుతుంది. బ్రిటిష్‌వారు వచ్చిన తరువాత అప్పటినిజాంనవాబు ఉత్తర సర్కారులను అమ్మివేయడం జరిగింది. అదే విధంగా దత్తమండలాలు (రాయలసీమ) వేరుపడిపోయింది. వీటన్నిటినీ తిరిగి ఏకంచేయడమే ఆంధ్రులలక్ష్యం. తెలుగు ప్రాంతాలన్నీ కలిసిన రాష్ట్రాన్ని విశాలాంధ్రమన్నా, కేవలం ఆంధ్ర రాష్ట్రమేఅన్నా లేక హైద్రాబాద్ రాష్ట్రమన్నా యిబ్బందిలేదు.

విశాలాంధ్రఅంతటా ఖనిజ సంపద ఉంది. తెలంగాణ కోట్లాది రూపాయిలఖర్చు లేకుండానే రాజధానీ నగరాన్ని ప్రసాదిస్తుంది. కోస్తాజిల్లాలు వాణిజ్య వ్యాపారాలు పెంపొందించడానికి కావలసిన ఓడరేవుల్ని సమకూర్చుతాయి. విశాలాంధ్రలో నదీ సంపద మిక్కుటంగాఉంది. ప్రాజెక్టులు, విద్యుచ్ఛక్తితో విశాలాంధ్రనంతా సస్యశ్యామలంచేయవచ్చు. హయిద్రాబాదులో ప్రస్తుతం ఆదాయం ఎక్కువగా ఆబ్కారీపన్నుద్వారా వస్తున్నది. నేడో రేపో మద్యనిషేధము అమలుజరపకతప్పదు. అప్పుడాదాయం మరింత తగ్గిపోతుంది. అదీగాక కరోడ్గిరి (కస్టమ్సు) పన్నులరద్దువలన మరికొంత ఆదాయం తగ్గిపోతుంది. తెలంగాణ జిల్లాలకు వచ్చే ఆదాయంతో ప్రత్యేకరాష్ట్రముగా గవర్నరు, మంత్రులు, ఉపమంత్రులు, రాష్ట్ర కార్యదర్శులు, ఉన్నతోద్యోగులందరినీ నిలపలేదు. దీనికైఅధికంగా క్రొత్త పన్నులు వేయవలసివస్తుంది. ఆంధ్ర రాష్ట్రంలో అయితే నదులు, కాలువలు పున్నవి గమక నీటితీరువపన్నులు వేయవచ్చును. తెలంగాణాలో ఆ అవకాశంలేనందున నగరాలలోనివసించే వారిపై అధికపన్నుల భారము పడుతుంది.

"రెండు తెలుగురాష్ట్రాల ఆలోచన మొదలిటి ఉండేదేకాదు. అప్పుడంతా విశాలాంధ్ర ధ్యేయాన్నే కలిగిఉండేవారు. కాని తమస్థానాలు, పదవులు నిలుస్తాయా లేదా అనే ఆలోచన వచ్చి కొందరు రెండురాష్ట్రాలవాదాన్ని ఈమధ్యే ప్రారంభించారు. తెలంగాణరాష్ట్రాంధ్రయంపోషకంకాలేదు. గనుక ఒకే ఒక తెలుగురాష్ట్రముండటమే ఆంధ్రులందరి సర్వతోముఖాభివృద్ధికి అవసరం.'

హయిదరాబాద్ డిప్యూటీమేయరు అహ్మద్ అలీఖాన్, డా॥ కె. రంగాచారి గారలు కూడ విశాలాంధ్రను సమర్థిస్తూ ప్రసంగించారు.

(శ్రీవిశ్వనాథం, 'ధరణీధర సంఘీ గారల ప్రసంగాలు వేరుగాఇవ్వబడినవి. సం.)

జాతీయ ప్రణాళికా సర్టిఫికెట్లు

మొదటి 4 వారాలకు 45 లక్షల రూపాయలు సేకరణ

న్యూఢిల్లీ, జూన్ 21

1954 జూన్ 5 వ తేదీతో అంతమయ్యే 4 వారాలలోను 45 లక్షల రూపాయలవిలువగల జాతీయప్రణాళికా సర్టిఫికెట్లు విక్రయించబడ్డాయి.

పంచవర్షప్రణాళిక నిర్వహణకు నిధి సేకరించేనిమిత్తం ఏప్రిల్ నెలలో ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ప్రణాళికా ఋణంలో ఈ సర్టిఫికెట్లు ఒకభాగం ఈసర్టిఫికెట్లవిక్రయం మే 10 వ తేదీన ప్రారంభింపబడింది. ఒక్కొక్కవ్యక్తి 25 రూపాయలకుతక్కువకాకుండాను పెయ్యిరూపాయలకు మించకుండాను కొనవచ్చును. ఇద్దరువ్యక్తులు కలిసి 2,000 రూపాయలవరకూ సర్టిఫికెట్లను కొనవచ్చును. దీనికి ఆదాయపుపన్ను వుండదు. [illegible] 4 శాతవడ్డీ [illegible] బడుతుంది.

1954 మే ఆఖరుకు జాతీయప్రణాళికాఋణం 60కోట్ల 50లక్షలరూపాయలు వసూలైనది. ఈ ఋణసేకరణ కార్యక్రమం సాగుతున్నది.

జూన్ 26 న ఫజులలీ కమీషన్ రాక

రాష్ట్రంలో 10 రోజులు మకాం

హయిద్రాబాద్, జూన్ 21

ఫజులలీ అధ్యక్షతన భారతప్రభుత్వం ఏర్పరచిన రాష్ట్రాల పునర్నిర్మాణ కమీషన్ హయిద్రాబాదు నగరానికి యీ నెల 26 వ తేదీనవస్తున్నది. కమీషన్ కార్యదర్శిమాత్రం 24 వ తేదీనే నగరానికివస్తాడు.

ఈ కమీషన్ రాష్ట్రంలో పదిరోజులుండి ప్రజానాయకులనుండి, సంస్థలనుండి సాక్ష్యంతీసుకుంటుంది, మెమోరాండాలుకూడా స్వీకరిస్తుంది.

ఈకమీషన్‌సభ్యులుజిల్లాలనుకూడా పర్యటిస్తారట. అన్నిజిల్లాలు కాకపోయినా కనీసం మూడు భాషాప్రాంతాల్లోని మూడుజిల్లాలైనా వీరు పర్యటించవచ్చు.

దారితప్పిన కేంద్ర ఉపమంత్రి

ఔరంగాబాద్, జూన్ 21

ఇటీవల ఔరంగాబాద్‌కు వచ్చిన కేంద్ర డిప్యూటీ హోంమంత్రి శ్రీ బి. ఎన్. దాతార్ అజంతా గుహలనుండి జలగాంవ్‌కు కారులో తిరుగుతూ దారితప్పి ఒక రైల్వేస్టేషన్‌కు వెళ్ళారు. తీరా అక్కడమాస్టే తనను ఆహ్వానించుకొనే వారెవరూ ఆయనకు కనపడలేదు. చివరకు ఒక కానిస్టేబుల్ సహాయంతో ఆయన జలగాంవ్ డాక్‌బంగళా చేరుకోగా అక్కడ కలెక్టరు శ్రీ దాతార్‌కొరకు వేచిఅన్న విషయము తెలిసింది.

తెలంగాణా, పి-ఎస్-పి కార్యకర్తలసభ వాయిదా

హయిద్రాబాద్, జూన్ 21

మంచిర్యాలలో ఈ నెల 27వ తేదీన జరుగనున్న తెలంగాణా ప్రజా సోషలిస్టుపార్టీ కార్యకర్తల సమావేశం ప్రస్తుతానికి వాయిదా వేయబడింది.

ప్రెంచివిమానంసోదా

కలకత్తా, జూన్ 21

నేను 85 మంది ప్రయాణీకులతో సైగాన్‌కు పోతున్న ఒక ఫ్రెంచివిమానం దమం విమానాశ్రయములో ఆగినప్పుడు కస్టమ్సుఅధికారులచే సోదాచేయబడెను. అధికారులుప్రయాణీకుల వస్తువులన్నీ సోదాచేసి మోటార్ స్పేర్ పార్టులు ఉన్నటువంటి కొన్ని పేకేజీలను నిలిపివేశారు.

ఈ సోదావల్ల ఉదయం 5 గంటలకువచ్చిన విమానం 8 గంటలు ఆలస్యంగా పదిగంటలకు ప్రయాణమై వెళ్ళింది.

భూదానోద్యమ శిక్షణ

కార్యకర్తలకు స్వామీజీ విజ్ఞప్తి

హైద్రాబాద్, జూన్ 21

భూదాన ఉద్యమంకొరకు పాటుపడదలచిన వారందరు ఆగస్టు నెలలో నిర్వహింపబడే శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందవలసిందిగా శ్రీ రుద్రూ స్వామీరామానందతీర్థ నేడొక విజ్ఞప్తి చేశారు.

భూమిపంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సుశిక్షితులైన కార్యకర్తలు అవసరమంటూ ఆయన భూదాన ఉద్యమానికికృషిచేయదలుచుకున్నవారు ఒక వారం రోజులు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందటం అవసరమన్నారు. ఈ శిక్షణ పొందిన తర్వాత వారు కనీసం 15 రోజులయినా తమ వీలువెంబడిని భూమిపంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించవలసి ఉంటుందని స్వామీజీ తెలిపారు.

కాబట్టి భూదానోద్యమ కృషిలో పాల్గొనదలచిన వారందరూ జూలై 15వ తేదీలోపల తమ పేర్లను గాంధీభవన్‌లోని భూదానయజ్ఞసమితి కార్యాలయానికి పంపించాలని స్వామీజీ కోరారు.

బొంబాయిలో కుంభవృష్టి

బొంబాయి, జూన్ 21

గత రెండు రోజులుగా బొంబాయిలో కుంభవృష్టికురిసి చుట్టుపక్కల ఉత్పాతకలిగే రైళ్ళు సరిగా నడవకున్నందున నేడు అనేకమందిఆఫీసులకు వెళ్ళలేకపోయారు.

బొంబాయినగరంలో యీ నిర్విరామవర్షపాతంవల్ల అనేకపల్లపుప్రాంతాలు మోకాలిలోతునీళ్ళలో మునిగిపోయాయి. అనేకరోడ్లు ఇంకా వరదల్లోఉన్నట్లే ఉన్నాయి కాని ఈ వర్షాలు బొంబాయిరాష్ట్రంలో ఆహారపుకొరతలుతీర్చగలవని భావించబడుతున్నవి.

400 టెలిఫోనులైన్లు పాడయిపోయాయి. షార్టుసర్క్యూట్‌వల్ల కొన్ని చోట్లఆగ్ని ప్రమాదాలేర్పడ్డవికూడా.

బంగారం, బొగ్గు, సిమెంటుల ఉత్పత్తి

మే నెలలోని వివరాలు

హయిద్రాబాద్, జూన్ 21

రాష్ట్రంలో మే నెలలో 13805.90 ఔన్సుల నికాలస్ బంగారం ఉత్పత్తి చేయబడిందని పత్రికాప్రకటన వెల్వడింది. మేనెలలోనే రాష్ట్రమంతటా 118147 టన్నులబొగ్గు 22314 టన్నులు సిమెంటుకూడా ఉత్పత్తి చేయబడ్డాయని తెలియజేయబడింది.

మద్రాస్ అసెంబ్లీకి శ్రీ నాడార్ పోటీ

గుడియాత్తం నియోజక వర్గంనుండి

మద్రాస్, జూన్ 21

మద్రాస్ ముఖ్యమంత్రి శ్రీ కె. కామరాజ నాడార్ మద్రాసు శాసనసభకు గుడియాత్తం ద్విసభ్యనియోజకవర్గంనుండి ఎన్నికలకు పోటీచేయనిశ్చయించారు.

ఈ విషయాన్ని ఆయన నేడు పత్రికా ప్రతినిధులతో చెప్పుతూ, తాను జనరల్ సీటుకు పోటీచేస్తానని రిజర్వుడు సీటుకు మరో అభ్యర్థిని వెంటనే తమిళనాడు కాంగ్రెసు కమిటీ ఏర్పరచగలనని అన్నాడు. ఈ ఎన్నికలకు నామినేషన్లు దాఖలుచేయవలసిన ఆఖరు తేదీ జూన్ 24.

నియోజకవర్గాల పునర్విభజనసంఘం

మద్రాస్, జూన్ 21

నియోజకవర్గాల పునర్విభజన సంఘము 1954 జూన్ 23 వ తేదీన ఉదయం 10 గంటలకు పూడీలోని టౌన్ హాలులో సమావేశమై 1954 జూన్ 16 వ తేదీవరకూ ఒరిస్సా రాష్ట్రములోని పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలవిషయంలో తమ సూచనలపై వచ్చిన ఆక్షేపణలను, సూచనలను పరిశీలిస్తారని, అవసరమైతే జూన్ 24 న కూడా పరిశీలనసాగించగలరని, 1954 మే 25 న ఇండియాప్రభుత్వ [అసాధారణ] గెజెటులో ప్రకటించబడింది.

కేంద్రాభిప్రాయాన్ని బలపరుస్తూ డా॥ జకీర్ ఉసేన్ వ్యక్తీకరణ

92రోజుల 2గంటలు గాజుపెట్టెలో ఉన్న బర్త్డా ఫకీరు

ఢిల్లీ, జూన్ 21

ఒక బర్త్డాఫకీరు గత 92 రోజులు రెండు గంటలపాటు గాజుపెట్టెలో నివసించి నిన్న బయటికి వచ్చాడు. ఇంతవరకు ఇలా యోగ ప్రదర్శనం చేసినవారికన్న యీ ఫకీరు 11 రోజుల 7 గంటలు ఎక్కువ సేపు గాజుపెట్టెలో ఉన్నాడు. ఆతడు ఉప్పు, సోడా నీటిమీద ఆధారపడి ఇన్నాళ్ళు ఉండడంవల్ల 19 పౌన్లు బరువు తగ్గాడు.

ఈ ఫకీరు తిరిగి ఆరోగ్యం కోలుకోవడానికి మూడునెలలు పడుతుందని ఒక డాక్టరన్నాడు. ఇదివరకు ఇటువంటి యోగ ప్రదర్శనాన్ని ఒక జర్మన్ దేశీయుడు చేశాడు.

శ్రీ నూకల రామచంద్రారెడ్డిగారు

మహబూబాబాద్, జూన్ 21

మహబూబాబాద్ తాలూకా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు ఇటీవలగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ నూకల రామచంద్రారెడ్డిగారు తమ పదవికి రాజీనామా ఇచ్చారు. మహబూబాబాద్ తాలూకా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికలు ఈ నెల 27 వ తేదీన జరుగుతాయి.

అయినప్పటికీ ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం ఉండాలని సూచన

కర్నూలు, జూన్ 21

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చేవిషయాన్ని పరిశీలించడానికి భారతప్రభుత్వంచే నియమించబడిన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జకీర్ హుసేన్ ఉస్మానియాను హిందీ విశ్వవిద్యాలయంగా మార్చాలని కేంద్రానికి ఏర్పడిన అభిప్రాయాన్ని సిద్ధాంతరీత్యా నేడు బలపరిచాడు.

ఫారెస్టు చౌకీదారుపై దౌర్జన్యం

మహబూబాబాద్, జూన్ 21

కేసముద్రం హల్కాకు చెందిన ఒక ఫారెస్టు చౌకీదారును ఇక్కడికి సదిమైళ్ళ [illegible] రైతులు పటుకుని తీవ్రంగా కొట్టారు. రిజర్వు ప్రాంతంలో ఆ రైతులను సాగు చేసుకోనియనందున ఈ దౌర్జన్యం జరుపబడిందని తెలుస్తున్నది. దెబ్బలు తిన్నచౌకీదారు ఆస్పత్రిలో చేర్పబడ్డాడు. ఫారెస్టు రేంజరు తన ఉద్యోగులతో పాటు ఆప్రాంతానికి వెళ్ళి విచారణ జరిపి 15 మంది రైతులను చాలాకాలం చేశాడు. ప్రభుత్వాజ్ఞను ధిక్కరించి రిజర్వు ప్రాంతంలో రైతులు సాగుచేయడానికి వీలు లేకుండా జిల్లా అంతటా నిషేధించబడింది.

అన్ని భాషల అభివృద్ధికొరకు రాష్ట్రప్రభుత్వనిశ్చయం

మంత్రి డా॥ చెన్నారెడ్డిగారి ఉద్ఘాటన

హైద్రాబాద్, జూన్ 21

"హయిద్రాబాద్ రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి సంబంధించిన భాషా విషయక వివరాలన్నింటిని హైద్రాబాద్ ప్రభుత్వం చాలా జాగ్రత్తగా సేకరించింది. రాష్ట్రంలోని ప్రతిభాష యొక్క హక్కులను సక్రమంగా, న్యాయసమ్మతంగా పరిరక్షించడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందికూడా. అందువల్ల ఏ భాషావర్గంగాని, తమ భాష అభివృద్ధి ఔన్నత్యాలనుగురించి ఏ విధమైన అనుమానాలు పెట్టుకోనక్కరలేదు." అని గత వారం గంజ్ హల్లీ గ్రామంలో క్రొత్తగా నిర్మించబడిన ప్రాథమిక పాఠశాలా భవనానికి ప్రారంభోత్సవం కావిస్తూ సప్లయి శాఖామంత్రి డా॥ యం. చెన్నారెడ్డి గారు అన్నారు.

ఈ ప్రాథమిక పాఠశాల ముందు ముందు మాధ్యమిక పాఠశాలగా అభివృద్ధికి చెందేందుకు వీలైన పద్ధతిలో ప్రస్తుతం 6 గదులతో ఈ భవనం కట్టబడింది.

గంజిహల్లీ గ్రామం రెండు భాషలలో కూడుకున్న గ్రామాలలో నొకటి. మంత్రి శ్రీ చెన్నారెడ్డిగారు రాయచూర్‌నుండి జూలై 13వ తేదీ సాయింత్రం నాలుగున్నరకు రాగానే గ్రామస్తులు ఘనస్వాగతం యిచ్చారు. ఆయన అక్కడినుండి కుస్తకి వెళ్ళి ఆ పిమ్మట సింధనూర్ తాలూకాలోని ధాలేసాగర్ వద్దగల వ్యవసాయక పరిశోధనా కేంద్రాన్ని పరిశీలించి తిరిగి రాయచూర్ వెళ్ళారు.

రాయచూర్‌లో ఆయన అధికార, అనధికార ప్రముఖులతో వచ్చేనెలల్లో జొన్నల సప్లయి గురించి రాయచూర్ జిల్లాలో పండిన ప్రత్తికి బొంబాయిలో అమ్మకాన్ని గురించి చర్చలు జరిపారు.

హిందువులలో మరణ శాసనం

వ్రాయకుండా చనిపోయిన వారి ఆస్తులకు వారసత్వం

హయిద్రాబాద్, జూన్ 21

హిందువులలో మరణశాసనం వ్రాయకుండా చనిపోయినవారి ఆస్తులు వారసత్వమునకు సంబంధించిన శాసనమును సవరించడానికి రాజ్యసభలో త్వరలో ఒకబిల్లు ప్రవేశపెట్టబడనున్నది. ఈ బిల్లుమొక్కపాతం 1954 మే 23 వ తేదీనాటి ఇండియా అసాధారణ గెజెటులో ప్రకటించబడింది.

బిల్లుపై అభిప్రాయములు చెప్పదలచుకొన్నవారు 1954 జులై 10 వ తేదీలోపుగా హయిద్రాబాదు ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శికి వ్రాసి పంపవలెను. నేరుగా రాజ్యసభ కార్యాలయానికిగాని లేక భారతప్రభుత్వఇతర మంత్రిత్వశాఖలకుగాని పంపబడిన అభిప్రాయములు స్వీకరింపబడవు.

ఖద్దరు పరిశ్రమాభివృద్ధి

రాష్ట్రఖాదీ సమితి నిర్ణయాలు

హయిద్రాబాదు, జూన్ 21

కరీంనగర్ జిల్లాలోని మెట్టుపల్లి, జమ్మికుంట కేంద్రాల్లో ఈ విదాది 20 లక్షల రూపాయల విలువగల ఖద్దరును ఉత్పత్తి చేయాలని హయిద్రాబాదు ఖాదీ సమితి నిర్ణయించింది.

స్వామీ రామానందతీర్థ అధ్యక్షతన నిన్న గాంధీభవన్‌లో సమావేశమైన రాష్ట్రఖాదీ సమితి కార్యవర్గం ఉస్మానాబాదు జిల్లాలోని ఇవుసాబుద్ గ్రామాలో సూలువడకటంలోనూ ఖద్దరు కేంద్రాన్ని అభివృద్ధి పరచటంలోనూ స్థానికులకు శిక్షణఇచ్చే ప్రణాళికను అమలు జరుపాలనికూడా నిశ్చయించింది. ప్రస్తుతం పర్భనీ, ఖీన్, నాందేడ్, మహబూబ్‌నగర్‌లోఉన్న ఖద్దరు భాండారాలకన్న అభివృద్ధికామైన ప్రాతిపదికమీద ఔరంగాబాద్, లాతూర్, మోమినాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మంలలో ఖద్దరు భాండారాలనుస్థాపించేయాలనికూడా బోర్డునిర్ణయించింది. కుటీర పరిశ్రమలను ప్రచారంలోకి తేవడంకోసం హయిద్రాబాద్ నగరంలో ఖద్దరు గ్రామపరిశ్రమల ఎంపోరియాన్ని ఏర్పరచాలనికూడా నిర్ధారించబడింది. నిర్మాణ కార్యక్రమాలకు కేంద్రంగా బోచంపల్లిలో ఖద్దరు ఉత్పత్తిని శిక్షణమే అభివృద్ధికి తేవాలని ఖద్దరు అభివృద్ధి స్కీముల్లో ముఖ్యంగా చేర్చుకోటానికి వీలుగా ఈ పరిశ్రమలో వర్కర్లకు శిక్షణ ఇవ్వాలని ఉద్దేశించబడి, 10 వేల రూపాయిలు కేటాయించబడాలనికూడా నిశ్చయించబడింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రం తీసుకొని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చాలనే నిర్ణయాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయ కమిటీ అధ్యక్షుడు డా॥ జకీర్ హుసేన్ నేడిక్కడ సమర్థించినట్లు "ప్రెస్ ఆఫ్ ఇండియా" విలేఖరి వ్రాస్తున్నాడు.

కేంద్రప్రభుత్వ నిర్ణయంలో యిమిడివున్న విషయాలపై నివేదికనందించడానికి ఈ కమిటీ నియమించబడింది.

దేశములో నాలుగు కేంద్ర పాలిత విశ్వవిద్యాలయాలున్నవని దురదృష్టవశాత్తు అవన్నీ ఉత్తర దేశంలోనే ఉన్నవని డా॥ హుస్సేన్ అన్నాడు. "అందువలన అలాంటి ఒక సంస్థను దక్షిణదేశములోకూడ ఏర్పాటుచేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించడము చాల సమంజసం" అని అతడుఅన్నాడు

దక్షిణ దేశములోని అన్ని విశ్వవిద్యాలయాల కంటె ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చడం తేలిక అని అతడు భావించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ బోధన భాషగా ఉండటం వలన ఉర్దూనుండి హిందీకి మార్చడం చాల తేలిగ్గా అయిపోతుంది. కేంద్రం ఉస్మానియాను తీసుకొని హిందీని బోధనభాషగా ప్రవేశపెట్టినా విశ్వవిద్యాలయంలో అన్ని స్థానిక భాషలకు బలమయిన శాఖలు ఉండాలని అతడన్నాడు.

రెండుతెలుగు రాష్ట్రాలకు సమర్థన

హయిద్రాబాదు ప్రజా పరిషత్తు అధ్యక్షుని వైఖరి మార్పు

హయిద్రాబాదు, జూన్ 21

హయిద్రాబాదు రాష్ట్ర విచ్ఛిత్తికి వ్యతిరేకంగా పనిచేయడానికి ప్రజా పరిషత్తు అనే సంస్థను స్థాపించి దానిఅధ్యక్షుడుగా వ్యవహరిస్తూ వచ్చిన శ్రీ ఎ. నారాయణరెడ్డి రెండు తెలుగురాష్ట్రాలు ఏర్పడాలని తెలంగాణ కాంగ్రెసు ప్రతినిధులు తీసుకొన్న నిర్ణయాన్ని బలపరుస్తూ హయిద్రాబాదు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షునికి లేఖవ్రాసినట్లు తెలుస్తున్నది.

ఈయన రాష్ట్ర విచ్ఛిత్తి జరగరాదంటూ తెలంగాణలో సంతకాలఉద్యమాన్ని ప్రారంభించారు. కూడ అయినా రెండు తెలుగు రాష్ట్రాల సిద్ధాంతానికి సమ్మతించి తన అంగీకారాన్ని పి. సి. సి. అధ్యక్షునికి పంపించారు.

ఏ- ఎస్-ఎస్-

రైహాండ్ ఆనకట్ట నిర్మాణం

న్యూఢిల్లీ, జూన్ 21

రైహాండ్ ఆనకట్ట నిర్మాణములో సిమెంటు కాంక్రీటు తాపీ పనులవలన కలిగే లాభనష్టాలను పరిశీలించి ఒక నివేదికను తయారుచేయడానికి ఇరిగేషన్ విద్యుచ్ఛక్తిమంత్రిత్వశాఖ 1954 మే, లో ప్రవీణులయిన ఇంజనీర్లతో కూడిన ఒకకమిటీని నియమించింది. భవన నిర్మాణ పరికరాలు కూలీలెంత వరకు లభ్యమయ్యేది, దాని నిర్మాణానికి యెంతవ్యయమవుతుంది ముందుగా పరిశీలించి ఆనివేదికను తయారుచేయాలని ఆ కమిటీవారిని కోరారు. హీరాకుడ్ ప్రాజెక్టు, దామోదరవాలీ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్లు, ఉత్తర ప్రదేశ్ చీఫ్ ఇంజనీరు, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమిషన్ (డిజైన్సు) సభ్యుడు మే 18 న రైహాండ్ వద్దగల ఆనకట్ట స్థలాన్ని పరిశీలించి మే 21 వ తేదీన ఇండియాప్రభుత్వానికి తమ నివేదికను సమర్పించారు. రాతితోనే ఆ ఆనకట్టను నిర్మించాలని వారు తమ ఏకగ్రీవాభిప్రాయాన్ని వెల్లడించారు. కాంక్రీటుతో నిర్మిస్తే మామూలుగా రాతితోకట్టితే అయ్యేవ్యయముకంటే 2 కోట్లరూపాయలు యెక్కువకాగలదని వ్యవధికూడా 9 నెలలు ఎక్కువ కాగలదని వారు పేర్కొన్నారు. రాతితోకడితే సుమారు 5,500 మంది అదనపు కార్మికులకు 6 సంవత్సరాలు పని వుంటుందని వారు పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ చీఫ్ ఇంజనీరు మాత్రం అధికసంఖ్యాక సభ్యుల అభిప్రాయముతో ఏకీభవించలేదు.

ఇరిగేషన్ మంత్రిత్వశాఖ వారు జూన్ 8,9 తేదీలలో మరికొంతమంది ఉన్నత ఇంజనీర్లతో సంప్రతింపులు జరిపినవారిఅభిప్రాయాలనుకూడ తెలుసుకొన్నారు. సిమెంటుకాంక్రీటు లేక మామూలురాతితోనేకడితే నిర్మాణం త్వరగా పూర్తికావటమేగాక బలీయముగా కూడా వుండగలదని ఆ ఇరికసంఖ్యాకులు అభిప్రాయపడ్డారు. ఆ పద్ధతిలోనిర్మిస్తే ఎక్కువమందికార్మికులకు పనివుంటుందనీ, విదేశాలనుంచి కూలికరాలు ఎక్కువగా దిగుమతిచేసుకోనవసరం లేదనీకూడా వారు చెప్పారు.

అయినప్పటికీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం అందువలన రైహాండు ఆనకట్ట నిర్మాణంలో వుపయోగించవలసిన నిర్మాణ పరికరాలవిషయం ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికే వదలివేయడానికి ఇండియాప్రభుత్వంనిర్ణయించినది.

ఆహారం పంచవర్ష ప్రణాళిక

కొత్తఢిల్లీ, జూన్ 21

ప్రపంచయుద్ధసమయంలోవిదేశాలనుంచి ఆహారపదార్థాలను తెప్పించడానికి ఇండియా ప్రభుత్వం 1150 కోట్ల రూపాయలను వెచ్చించినదని కేంద్ర ప్రభుత్వ ఆహారశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ యం. వి. కృష్ణప్ప ఇటీవల మైసూరువెళ్ళినప్పుడు వెల్లడించారు. ఆ మొత్తం భారతదేశంలోని ఇరిగేషన్ సౌకర్యాల సభివృద్ధిచేయడానికివెచ్చించినట్లయితే ఇండియాకు ఆహారకొరత అనేది వుండజాలదని ఆయన అన్నారు. పంచవర్షప్రణాళికలో చేర్చబడిన ప్రాజెక్టులన్నీ పూర్తిఅయితే ఇండియాలో అదనంగా 300 లక్షల ఎకరాల భూమి సాగులోకి రాగలదు.

సెంట్రల్ రైల్వే టెండరు

ది కంట్రోలర్ ఆఫ్ స్టోయిన్ సాప్సు, సెంట్రల్ రైల్వే 3 వ ఫ్లోర్, వి. టి. ఎనెక్సి బిల్డింగ్, బొంబాయి, వారు సెంట్రల్ రైల్వే స్టోయిన్ సాప్ సికింద్రాబాదుకొఱకు తుర్దల్ మరియు గ్రామ్‌దల్ ప్రతిది 1100 టుణగులు నష్టయి చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి.

టెండరుడాక్యుమెంట్లు సెట్టు 1 కి రు. 1-0-0 చెల్లించిన ది కంట్రోలర్ ఆఫ్ స్టోయిన్ సాప్సు, సెంట్రల్ రైల్వే బొంబాయి వి. టి. లేక అసిస్టెంట్ కంట్రోలర్ స్టోయిన్ సాప్సు, సెంట్రల్ రైల్వే సికింద్రాబాదు నుండి కాని పొందవచ్చును.

టెండర్లు 30-6-54 తేది ఉ॥ 10-0 గం॥ లకు ముందుగా కంట్రోలర్ ఆఫ్ స్టోయిన్ సాప్సు, సెంట్రల్ రైల్వే 3 వ ఫ్లోర్ ఎనెక్సి బిల్డింగ్, బొంబాయి వి. టి. వారికి చేరవలెను.

గోలకొండపత్రిక

జయ సం॥ జ్యేష్ఠ॥ బు॥ ౬ మంగళవారం

విశాలాంధ్ర వాంఛ

ఇటీవల ఆంధ్ర ఆర్థికమంత్రి శ్రీ విశ్వనాథంగారు హైద్రాబాద్ నగరానికి వచ్చిన సందర్భంలో తెలుగు ప్రజలను ప్రధానంగా కలవరపెడుతున్న సమస్య అగు విశాలాంధ్రనుగూర్చి వారు వెల్లడించిన అభిప్రాయాలు ఏకతెలుగురాష్ట్ర ఆవశ్యకతనువివరిస్తూ చేసిన ప్రసంగాలు ఆంధ్ర ప్రభుత్వము మరియు ఆంధ్ర ప్రజల అభిప్రాయాల్ని హైద్రాబాదు రాష్ట్రపు తెలుగు ప్రజలు గ్రహించుటకు తోడ్పడుచున్నవి. ఆంధ్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్నిర్మాణ కమిషన్‌కు సమర్పించిన మెమోరాండమందు నిజాం గవర్నరుగా ఒకే ఒక తెలుగు రాష్ట్రాన్ని ఏర్పాటుచేయవలసినదిగా కోరినదని వీరు తెలిపినారు.

ఆంధ్రప్రభుత్వం విశాలాంధ్ర సత్వరముగా ఏర్పడుటకు హైద్రాబాదు రాష్ట్ర విచ్ఛిత్తి అత్యవసరమై ఉన్నందున ఈ రాష్ట్ర విచ్ఛిత్తికి ఆటంకమని భావింపబడుతున్న నిజాంను విశాలాంధ్రకు గవర్నరుగా చేసిన ఈ సమస్య సులభముగా పరిష్కారమగునని భావించి, నిజాంను విశాలాంధ్రకు గవర్నరుగా ఉండవచ్చునని సూచింపవచ్చును. ఇట్టి ప్రతిపాదన ఆంధ్ర ప్రభుత్వము చేయుటలో మరొకఉద్దేశము వేరే కానరాదు. ఏర్పడబోయే విశాలాంధ్ర బి తరగతి రాష్ట్రము కానందున దానికి గవర్నరు ఆధిపత్యమే అవసరమయి ఉండగలదు. తెలంగాణాప్రజలేమి పూర్తి హైద్రాబాదు రాష్ట్ర ప్రజలు నిజాంను గద్దెదింపవలెనని అంటున్నారు. అతను రాజప్రముఖ్ రూపంలోగాని లేక గవర్నర్ రూపంలోగాని అధికారంలో ఉండుటకు తెలుగు ప్రజలు కోరడంలేదనేది సుస్పష్టము. అందువల్ల ఆంధ్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్నిర్మాణ కమిషన్‌కు నిజాం గవర్నర్‌గా విశాలాంధ్ర నిర్మాణాన్ని కోరుతూ మెమొరాండమును సమర్పించినా ఈ విషయమై తెలంగాణా ప్రజావాంఛితమునకు భిన్నముగా అధి వ్యవహరించుటకు వీలులేదని మేము పేర్కొంటున్నాము.

ఒకే భాష మాట్లాడు ప్రజలు సాధారణముగా ఒకే రాష్ట్రమును కోరవలెను కాని రెండు రాష్ట్రముల కోరుట సరికాదు. ఏ భాషారాష్ట్రవాదులు గూడా ఇట్టి వాంఛను తెలుగువారంత స్పష్టముగా వెలువరించలేదు. రెండు తెలుగు రాష్ట్రముల కోర్కె అందువల్లనే విడ్డూరముగాను, విపరీతముగాను కాన్పించగలదు. తెలుగు ప్రజలంతా ఒకే రాష్ట్రముక్రిందికివచ్చిన అనవసరమైన పరిపాలనవ్యయము తగ్గుట, తదితరములగు పెక్కు లాభములు కలుగగలవు. తెలంగాణా ప్రజలుగాని, ఆంధ్ర ప్రజలుగాని భిన్నమైనవారు కారు. ఒకరిపట్ల ఒకరికి అనుమానాలు ఉండుట కూడనివి. తెలంగాణా వెనుకబడిన ప్రాంతము. కావున విశాలాంధ్రలో తెలంగాణా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహింపబడగలదు. శ్రీ విశ్వనాథం గారు 1765 వరకు సర్కారు జిల్లాలు హైద్రాబాదు రాష్ట్రములో ఉండినవేనని అప్పుడే తూర్పు ఇండియా కంపెనీ వీటినితీసుకొన్నదని తెలంగాణాప్రజలు ఆంధ్రలో కలుస్తున్నట్లు భావింపక వారే తెలంగాణాలో చేరుతున్నటుల తలంప వలెనని అన్నారు. వాస్తవముగా మూడున్నర కోట్ల ప్రజలు ఏక రాష్ట్రం క్రిందికి వచ్చుట అభిలషింపదగినది. అంతా ఒకటనే భావము పెంపొందవలెను. మూడున్నర కోట్ల ప్రజలు గల రాష్ట్రము కేంద్రములో తగిన పలుకుబడి కలిగి అభివృద్ధి పొందగలదనుట నిర్వివాదాంశము. ఇట్టి పలుకుబడి రెండు తెలుగు రాష్ట్రములు ఏర్పడిన ఉండజాలదు.

హెచ్. పి. సి. సి. యొక్క తెలంగాణా డెలిగేట్ల సమావేశములో రెండు తెలుగు రాష్ట్రాల నిర్మాణాన్ని కోరుతూ తీర్మాన మామోదింపబడినదే కాని అంత మాత్రమున వారు రాష్ట్ర విచ్ఛిత్తిని వ్యతిరేకిస్తున్నారని భావింపవీలులేదని రాష్ట్ర విభజన జరుగవలెనని శ్రీ రంగారెడ్డిగారు ఆనాటి తీర్మానము వ్యాఖ్యానిస్తూ ఒక వివరణను చేశారు. శ్రీ రెడ్డిగారు నుడివినటుల రెండు తెలుగురాష్ట్రాల కోరడం రాష్ట్ర విభజనకు వ్యతిరేకం కాకపోవచ్చును. కాని రాష్ట్ర విభజనను వాయిదావేయుటకు ఇది ఉపకరించ గలదేమోనని భావింపవలసి వచ్చుచున్నది. రాష్ట్రప్రజలంతా ఏకకంఠ్యంగా రాష్ట్ర విచ్ఛిత్తిని కోరుతున్నారు. రాష్ట్ర విభజన జరిగి తీరవలసినదేను. శ్రీ విశ్వనాథంగారు సూచించినటుల విశాలాంధ్ర వాదులు రెండు తెలుగురాష్ట్రాల కోరేవారిని విమర్శించడమే తమ పనిగా పెట్టుకొనక ఏకరాష్ట్రంవల్ల కలిగే సుఖాలనువివరిస్తూ ప్రజలకు నచ్చజెప్పవలెను. తమ అనైక్యతను చాటుతూ రెండు రాష్ట్రాల పేరుతో తెలుగువారు లభింపనున్న అవకాశాన్ని జారవిడచుకొనరాదు. ప్రస్తుతావకాశము పోయిన, తెలుగు వారు ఏకమయి ఒకే రాష్ట్ర పాలనక్రిందికి వచ్చు అవకాశము ఇప్పట్లో లభింపబోదు.

పత్రికలను తిన్న కుక్కలు

జబల్‌పూర్, జూన్ 21

కుక్కలు వార్తాపత్రికలను తినివేసిన విచిత్ర సంఘటన ఒకటి తెలియవచ్చింది.

జబల్‌పూర్ నుండి గోండియాకు పోయేరైలులో నైనాపూరుకు పోయే కొన్ని వార్తాపత్రికలకట్టలుగల పెట్టెలోనే కొన్నికుక్కలు ప్రయాణము చేస్తున్నవి. ఆకట్టలనుచింపివేసి పత్రికలను నమిలివేసినవి.

ఆ రోజున నైనాపూర్‌కు పత్రికలు లేకపోయినవి.

ఎగుమతి సర్‌ఛార్జీలు తగ్గింపుకు స్టేట్ ప్రభుత్వ ఆలోచన

హయిద్రాబాద్, జూన్ 21

రాష్ట్రమునుండి చేయబడే ఎగుమతులపై సర్‌చార్జీలను తగ్గించడానికి హయిద్రాబాద్ ప్రభుత్వం ఆలోచిస్తున్నదనీ ఈ విషయమై ఈనెలాఖరులోగా ఒక ప్రకటన చేయబడగలదని కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ వారి ఒక ప్రకటన తెలుపుతున్నది.

ఫెడరేషన్ ఆర్థికమంత్రికి చేసుకొన్న ఒకవిజ్ఞప్తిలో ఎగుమతులపైన సర్‌చార్జీలు పూర్తిగా తొలగించబడుటమో, లేక తగ్గించబడుటమో జరుగనిచో దీనివలన ఏర్పడబోవు పరిస్థితుల ప్రభుత్వం ఎదుర్కొనవలసి రాగలదని వచ్చే సంవత్సరం సూనెగింజలు పప్పుధాన్యాలపంట తగ్గిపోగలదని పేర్కొన్నది. ప్రభుత్వం ఈవిజ్ఞప్తిని పరిశీలించి సర్‌చార్జీలలో మార్పును తేవడానికి ఆలోచిస్తున్నటుల ఫెడరేషన్‌కు తెలుపబడింది. ప్రస్తుత పరిస్థితులలో సర్‌చార్జీలను పూర్తిగా తొలగించుటకు వీలుపడదని పేర్కొనబడినది

(యు.పి.ఐ)

సాలార్‌జంగ్ మ్యూజియం

హయిద్రాబాద్, జూన్ 21

ఆంధ్ర ఆర్థికమంత్రి శ్రీ టి. విశ్వనాథంగారు నిన్న సాలార్‌జంగ్ మ్యూజియమ్‌లో 5 నిమిషములు గడిపారు. అద్భుత సేకరించబడిన కళానిధులను ప్రశంసించారు.

మ్యూజియమ్‌లో ప్రదర్శించబడిన అపూర్వమైన కళాకైఖరులను శిల్పమునుచూచి తెన్నేటివారి మనస్సు మిక్కిలి లగ్నమైనట్లు కన్పించినది. సాటిలేని ఈమ్యూజియమ్‌ను సవివరణగా చూచుటకు వీలులేనందుకు తన విచారమును వెలిబుచ్చుచు మరల కొంతకాలంతర్వాత పునర్దర్శనము చేసికొనుటకు తమ ఆశాభావమును వెల్లడించిరి.

హైద్రాబాద్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పాతసభ్యుడు శ్రీ టి. వీరభద్రుడుగారితో కలసి ఈ విశ్వనాథంగారు వచ్చారు. (యు.పి.ఐ.)

ఇండో చైనా యుద్ధ విరమణ

ఉభయ కమాండ్ల ప్రతినిధుల సమావేశానికి నిర్ణయం

జెనీవా, జూన్ 20

రాత్రి ఇండోచైనాపై జరిగిన పరిమితమయిన సమావేశంలో వియత్‌నామ్, లావోస్, కాంబోడియాలకు మిలటరీ కమాండ్ల ప్రతినిధులకు తాత్కాలిక కాక శాశ్వతనివేదిక సమర్పించుటకై 21రోజులు వ్యవధి ఇవ్వబడినది.

జూన్ 22వతేదీన ఇండోచైనాపై సమావేశం జరగలదు.

ఇండోచైనాలో శాంతిస్థాపనకై తొమ్మిది రాజ్యాల ప్రతినిధులు ఈసమావేశంలో చర్చలజరిపారు. త్వరితంగా ఇండోచైనాలో శాంతిసాధనకై ఈ క్రిందిసూచనలు చేయబడినవి.

(1) ఉభయపక్షాల కమాండ్ల ప్రతినిధులు తక్షణమే జెనీవాలో కాని లేక యుద్ధ ప్రాంతంలోగాని సమావేశమవాలి. (2) వీరు కాంబోడియా లావోస్‌లలో యుద్ధచర్యల నిర్మూలనకై సంప్రదించవలెను. అవిరామ శేషాల సైన్యాలకు సాంకేతికనిపుణులకు ఉపసంహరించేందుకు నిర్ణయించవలెను, ఈ ప్రతినిధుల సమావేశపు నిర్ణయాల జెనీవాకు తెలుపవలెను. లేదా 21రోజులలో తాత్కాలిక నివేదికనైనా సమర్పించవలెను.

యు. పి. ఐ

రెండు తెలుగురాష్ట్రాల కోరడమే శ్రేయస్కరం

శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారిచే కారణాల వివరణ

హయిద్రాబాద్, జూన్ 20

రెండు తెలుగు రాష్ట్రాలకోరడం రాష్ట్రవిచ్ఛిత్తికి వ్యతిరేకం కాదు. రెండురాష్ట్రాలవల్లనే ఆంధ్ర తెలంగాణా సంబంధాలు బాగుపడి సన్నిహితత్వం సుహృద్భావం ఇనుమడించగలదని శ్రీ కొండా వెంకట రంగారెడ్డిగారు ప్రకటించారు.

హయిద్రాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ యొక్క తెలంగాణా ప్రాంత ప్రతినిధులు ఇటీవల సమావేశమై రెండు తెలుగురాష్ట్రాల కోరుతూ చేసిన తీర్మానంపై పి.సి.సి. అధ్యక్షులు కొండా వెంకట రంగారెడ్డిగారు వ్యాఖ్యానిస్తూ ఈతీర్మానాన్ని ఆమోదించడంతో తమఉద్దేశం స్టేట్ విభజనను వ్యతిరేకించడం కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజననే తాము కోరుతున్నామని అన్నారు.

కొంతకాలం నుండి అస్వస్థతలో ఉన్న రెడ్డిగారు ఈ తెలంగాణా ప్రతినిధుల సమావేశంలో పాల్గొనలేదు.

హైద్రాబాద్ రాష్ట్రం విభజింపబడి రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడేప్పుడు తెలంగాణా ఏక ఖండంగా ఒక రాష్ట్రంలో ఉండిపోగలదు. దీనికే అవసరమైన పరిసర తెలుగు ప్రాంతాలు చేర్చబడగలవు. ఈవిధంగా రెండు రాష్ట్రాలు ఆర్థికంగా పరిపాలనా విషయంగా ఇతర విధాల స్వయం సమృద్ధం చేయబడగలవు.

రెండు రాష్ట్రాలవల్లనే ఆంధ్ర తెలంగాణా సంబంధాలు బాగుపడగలవు. సన్నిహితత్వం అధికమయి పూర్తిజాతి బలపడగలదు'అని అన్నారు. వీరు,

(ఎ.ఎన్.ఎస్)

మేనమామ హత్య

మంగుళూరు, జూన్ 19

30ఏండ్ల వయస్సుగల మేనమామను హత్యచేయ ప్రయత్నించి ఆత్మహత్య చేసుకొన్న ఒక 20ఏండ్ల మేనకోడలు చర్య మంగుళూరుకునమీపంలోగల ఒక గ్రామంనుండి వినవచ్చింది.

30మంది సభ్యులగల కుటుంబంలో రామున్న సెట్టి (30) తన మేనకోడలు రత్న (20) నిద్రిస్తున్న గదిలోనే పండుకొన్నాడు. ఇంటిలోనివారు అగాధి నుండి ఏదోశబ్దం విన్నారు ఆగాధి తలుపులోపల వేయబడి ఉన్నందున ఆ బాలిక సోదరుడు అనుమానించి యింటి పైకప్పుద్వారావీలు చేసుకొని గదిలో ప్రవేశించాడు.

రామున్న సెట్టిపొట్టలో కత్తిపోటులతో రక్తస్రావాహంలోపడిఉన్నాడు. తనసోదరి తల మొండెము నుండి వేరు చేయబడిఉంది. ఆమె శరీరానికి చేరువన రెండు కత్తులున్నవి. రామున్న సెట్టిని వెంటనే ఆసుపత్రికి తీసుకొని పోయారు. అక్కడతుదు మరణవాఙ్మూలం యిస్తూ రత్న ఆరాతి ముందు తననిపొట్టలోపొడిచి తరువాత తనపీక కోసుకొని ఆత్మహత్య చేసుకొందని చెప్పాడు.

రత్న శరీరానికి పోస్టుమార్టం పరీక్ష చేసేటప్పుడు ఆమెగర్భంతో నున్నట్లు కనుగొనబడింది.

వీరిద్దరూ పరస్పరం ప్రేమించుకొన్నారని చెప్పబడుతున్నది. రామున్న సెట్టి రత్నకు మేనమామ గనుక ఆమె పడుకోగదిలో ఆతడుకూడ నిద్రిపోవడానికి యింట్లోనివారు అభ్యంతరం చెప్పలేదు. వారిద్దరికుత్య ప్రేమ సంబంధం ఉన్నదని ఎవరూ అనుమానించలేదు.

నందికొండ ప్రాజక్టు

తన పూర్వపు ప్రకటనకై శ్రీ విశ్వనాథంగారి ప్రకటన

హయిద్రాబాద్, జూన్ 21

నందికొండ ప్రాజక్టు హయిద్రాబాదు ప్రభుత్వ విధానాన్ని గూర్చి మొన్న ఆర్థికమంత్రి శ్రీ విశ్వనాథం గారు చేసిన ప్రకటనను నిన్న వివరించి చెప్పారు.

హయిద్రాబాదు ప్రభుత్వం ఈ ప్రాజక్టును గూర్చి ఎక్కువపట్టుదలచూపడం లేదంటే కావాలని కాదని పరిస్థితులు తదితర కారణములవల్లనని భావించుకొనవలెనని వీరన్నారు. హయిద్రాబాదు ప్రభుత్వవర్గములు తమ ప్రకటనను తప్పుడువిధంగా భావించుకొనే అవకాశం ఉన్నందున ఈ వివరణ చేయవలసి వచ్చినదని పేర్కొన్నారు.

వెనుకబడిన ముస్లిం తరగతులు

రక్షణకు హామీ

హైద్రాబాద్, జూన్ 21

అఖిలభారత వెనుకబడిన ముస్లిం ఫెడరేషన్ తరగతులకార్యదర్శి మహమ్మద్ హుస్సేన్ అధిగత్యంతో ఒక సంఘం, విశాలాంధ్ర మహాసభాధ్యక్షులగు శ్రీ కాళేశ్వర్రావు గారిచుట్టకు వెళ్ళి ఒక మెమోరాండం సమర్పించింది. విశాలాంధ్రలో వీరు వెనుకబడిన తరగతిగ పరిగణించబడాలని అందులో కోరబడింది. తరువాత ఈఫెడరేషన్ తెన్నేటి విశ్వనాథం గారికి కాళేశ్వర్రావ్ గారిచే పరిచయం చేయబడింది.

తరువాత, కష్టాల్లోవున్న ప్రతివర్గానికి సరైనన్యాయం కూర్చబడుతుందనీన్నీ, ఈమెమోరాండంలోచేర్చబడిన ముస్లింజాతులవారికికూడ రక్షణకల్పించబడుతుందని శ్రీ విశ్వనాథంగారు హామీ నిచ్చారు. (ఎ.ఎన్.ఎస్)

ఆహార ధాన్యాల నిలవకు సౌకర్యాలు

ఇండియా అమెరికాల ఒడంబడిక

న్యూఢిల్లీ, జూన్ 21

నిలువచేయబడే ఆహార ధాన్యాలు చెడిపోకుండా భద్రపరచడానికి అవసరమైన సౌకర్యాలను ఏర్పాటుచేయడానికి ఇండియా అమెరికా ప్రభుత్వాలు ఒక ఒప్పందాన్నికుదుర్చుకొన్నాయి. ఇందుకు మొత్తం 1539000 డాలర్లు, 1500000 రూపాయల ఖర్చు కాగలదని అంచనావేయబడింది. ఇందులోని డాలరుభాగం యంత్ర పరికరాలను, నట్లయిలను సమకూర్చడానికి, వాటిని ఇండియాకు చేరవేయడానికి వినియోగించబడుతుంది. రూపాయల భాగం దేశంలో అందునిమిత్తం అయ్యేఖర్చులకు, భూమిని సేకరించడానికి రవాణాకు వ్యయపరచబడుతుంది.

సుమారు 10లక్షలటన్నుల ఆహార ధాన్యాలు శాశ్వతమైన రిజర్వు నిధిగా భుంచడానికి ఇండియాప్రభుత్వం నిర్ణయించింది. ఆహార ధాన్యాలను జాగ్రత్తగా నిలవ చేయడానికి క్రొత్తరకం గిడ్డంగులనునెలకొల్పడానికి నిర్ణయించబడింది. పాతఇనుముతో గిడ్డంగులను నిర్మించే విధానంకూడ పరిశీలించబడుతుంది.సుమారు 50,000టన్నులునిలువ చేయటానికి వీలైనగిడ్డంగులు నిర్మించబడుతాయి. అమెరికాప్రభుత్వం ఆహార ధాన్యాలను నిల్వచేయడంలో నిపుణుడైన ఒకఉద్యోగిని, మరికొంత మంది సాంకేతిక ఉద్యోగులను ఇండియాకు పంపుతారు. కేంద్రప్రభుత్వ ఆహార శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులకు ఈవిషయంలో విదేశాలలో రక్షణ ఇవ్వబడుతుంది.

డమ్‌డమ్‌లో ఆపబడిన ఫ్రెంచి విమానాలు

వెళ్ళుటకు అనుమతి ఇవ్వబడుట

కలకత్తా, జూన్ 21

డమ్‌డమ్ విమానాశ్రయంలో ఆపబడిన మూడు ఫ్రెంచి సివిల్ విమానాలకు వెళ్లుటకు అనుమతివ్వబడినది.ఇవి కలకత్తానుండి సైగాన్‌కు వెళ్ళిపోయినవి.

సైగాన్‌కు అవివెళ్ళుటకు అనుమతిస్తూ విమానాశ్రయంలో గతరాత్రి వీటి ఏజంట్లకుఉత్తర్వులుఇవ్వబడినవి.

తొలుత డమ్‌డమ్ విమానాశ్రయాన్ని వీడిన విమానం ట్రాన్స్‌పోర్టు ఎయిర్ లైన్స్‌ఇంటర్ నేషనల్.రెండవది టి.ఎ.ఐ. స్కైమాస్టర్ ఈ రెంటిలో 29మంది ప్రయాణీకులుకలరు. మూడవ విమానం నగేటాఎయిర్ లైన్స్‌కుచెందిన ఆర్‌యున్నాక్. (యు.పి'ఐ)

శ్రీవీరరాఘవన్‌గారి పదవీ విరమణ

పురప్రముఖుల అసంతృప్తి

హయిద్రాబాదు, జూన్ 20

నేటిఉదయము సాగర్‌టాకీసులో పురప్రముఖుల సమావేశమొకటి జరిగింది. "నిజాంగెజెట్" సంపాదకులైన వికార్ అహ్మద్‌గారు అధ్యక్షోపన్యాసం యిచ్చారు. ఉపన్యాసంలో ఉద్యోగం నుండి రిటైరైన సేర్పరులను పుద్యోగస్థులవిషయమై చర్చించారు.

"తమీర్- ఎ- దక్కన్" సంపాదకులైన సయ్యద్ పైజుద్దీన్, పీయాజీ మాట్లాడుతూ, ప్రభుత్వ వివిధశాఖలు ప్రజల కష్టనష్టాలను తీర్చేటప్పుడు సంభవించు ఒడుదుడుకుల నాదుకోవాలిఅని వీరన్నారు ఉదాహరణకు పి. డబ్ల్యు. డి. శాఖ యిప్పుడు అనలువుండవలసిస్థానేలేదు. దీనికి ఒక ముఖ్యకారణం చురుకైన సేర్పరులైన అధికారులతగ్గుదల. ఇటువంటి సందర్భంలో ఒక సేర్పరియైన ఇంజనీరగు శ్రీ ఇ. వీరరాఘవన్ [పూర్వపుసూపరెంటెండింగ్ యింజనీరు, చిన్నఇరిగేషన్ పాజక్టులు] గార్ని ఈ శాఖ రిటైర్ చేసింది. దేశంపారిశ్రామికంగా ప్రతిష్ఠనొందుతున్నసమయంలోయిటువంటి ఇంజనీర్ల సహాయం ఆవశ్యకం.

శ్రీ వికార్ అహ్మద్ తన అధ్యక్షోపన్యాసంయిస్తూ ప్రజారాజ్యంలో, ప్రజలు తమశక్తియుక్తమైన కార్యాలు నిర్వర్తించేటట్లు చేయాలి శక్తివంతులైన పనివారలు ఆవశ్యకం. అధికారులు ప్రజలమధ్య 'సామరస్యంకు దుర్భటకు ప్రయత్నిస్తున్న విశాఖనుండిందరాదు. ప్రభుత్వం యిక్కడతీసుకొన్న మన తీర్మానాన్ని ఆచరణలో త్వరలోపెడుతుందని ఆశిస్తున్నాంఅని వీరన్నారు.

శ్రీ శాంతిలాల్, హిల్‌మి, కె. ఎమ్. వర్మలుకూడ మాట్లాడారు.

ప్రభుత్వం శ్రీ రాఘవన్‌గారిని పని విరమణ చేయకుండునట్లు చేయాలనిన్నీ యిందుమూలంగా దేశానికి లాభమనిన్నీ- పంచవర్షప్రణాళిక విజయవంతంకాగలదనిన్నీ ఒక తీర్మానం చేయబడింది. [ఎ. ఎన్. ఎస్.]

రంగారెడ్డిగారి సేవా ప్రశంస

పి. సి. సి. కార్యవర్గ తీర్మానం

హయిద్రాబాదు, జూన్ 21

హయిద్రాబాదు ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ కార్యవర్గం యిటీవలసమావేశమైనప్పుడు తన ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షపదవీకాలంలో శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారుచేసిన ఎనలేని సేవనుపేర్కొంటూ ఒక తీర్మానంఆమోదించింది.

ఈ తీర్మానాన్ని శ్రీ వల్లూరుబసవరాజుగారు ప్రతిపాదించగా శ్రీబొమ్మకంటి సత్యనారాయణగారు బలపరిచారు.

ప్రదేశ్ కాంగ్రెస్‌ప్రతినిధి ఒకరు మాట్లాడుచు కాంగ్రెస్ రాష్ట్రంలోని మూడు భాషాప్రాంతాలలోను బాలబలపడిందని వచ్చే జనరల్ ఎన్నికలలో విజయంపొందగలదని అన్నారు. ఇందుకుగాను కమ్యూనిస్టులకు స్థానరాలైన నల్లగొండ, వరంగల్ జిల్లాలు యింకా మధ్యస్థంలోఉన్నవని ఆయన అన్నారు. అయినా అక్కడిప్రజలుకాంగ్రెస్ పార్టీ ప్రాముఖ్యాన్ని గుర్తిస్తున్నారు.

హైద్రాబాద్ వాణిజ్య మహాసభ

హయిద్రాబాదు; జూన్ 21

మొదటి అఖిల హయిద్రాబాదు వాణిజ్య కాన్ఫరెన్సును ఆహ్వానించుటకు ఫెడరేషన్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ వారిచే చెప్పుకో దగినంత అభివృద్ధి కనుపరచబడినది. సుమారు 30 ట్రేడ్ యూనియన్లు పరిగణనలోకి తీసుకోబడ్డవి.

రాష్ట్రము అంతటినుండి వాణిజ్యమును నక్రమపరచుటకు సహకారమును సంఘటించు కొనుటకు జిల్లాలకు ఒక ప్రచారకుని పంపుటకు నిర్ణయించబడ్డడి. యు. పి. ఐ

విశాలాంధ్రవల్ల తెలుగు ప్రజలకు అధికలాభాలు

రెండు తెలుగురాష్ట్రాలకోర్కె నష్టకారియని శ్రీ తెన్నేటి విమర్శ

హైద్రాబాద్, జూన్ 20

దేశంలోని అన్ని తెలుగుప్రాంతాలతో కూడుకొన్న ఒకే తెలుగు రాష్ట్రాన్ని ఏర్పరచుట కొరకు ఆందోళన చేయవలసిన తగిన సమయము ఆసన్నమైనదని ఆంధ్ర ఆర్థిక మంత్రి శ్రీ విశ్వనాథం గారు నేడిక్కడ అన్నారు.

అన్ని తెలుగు ప్రాంతాలు ఐక్యపరచబడి విశాలాంధ్రఏర్పడే అవకాశములు కాన్పిస్తున్న ఈ సందర్భంలో రెండు తెలుగు రాష్ట్రాల కోరడం అవకారం చేసినటులనేకాగలదని వీరన్నారు. తెలుగు ప్రజలు తామంతా ఒకే రాష్ట్ర ప్రభుత్వంక్రిందికి వచ్చే అవకాశాన్ని జారవిడచుకోగూడదని దూరదృష్టితో వ్యవహరించి సమష్టిక్షేమాన్ని కాంక్షించాలని అన్నారు. కొన్ని తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కొరకై తప్పుడు నిర్ణయాల చేయడం సరికాదని తెలిపారు వీరు.

విశాలాంధ్ర మహాసభఆధ్వర్యంలో ప్రతాపగిర్జీ కోఠీయందు నేటి సాయింత్రంజరిగినబహిరంగసభలోశ్రీతెన్నేటి మాట్లాడుతూ పై విధంగా కోరారు. ఈ సమావేశానికి హయిదరాబాద్ మేయర్ ధరణీధర్ సాంఘి అధ్యక్షత వహించారు.

ఒకే తెలుగురాష్ట్రం ఉండటంవల్ల కలుగు ప్రయోజనాల ప్రచారం చేయుటవలనింకా విశాలాంధ్ర కు సంబంధించిన కార్యకర్తలను కోరుతూ ఇలా ప్రసంగించారు.

"విశాలాంధ్రను గూర్చి ఎవరికైనా ఏమయినా ఆపోహలు అనుమానాలు ఉంటే వాటిని తీరుస్తూ ఒక రాష్ట్రంవల్ల కలిగే ప్రయోజనాల వివరించిన రెండురాష్ట్రాల సిద్ధాంతాన్ని తెలంగాణా ప్రజలు ఆమోదించగలరని నేను విశ్వసింపజాలను. ప్రజలకు నచ్చజెప్పగలిగినవారితో పాటు, రెండు రాష్ట్రాలను కోరేవారి నాయకులు వెనక్కు రాకతప్పదు. తాము కోరేది సరియైనది కాదని వారు గ్రహింపగలరు."

"విశాలాంధ్రను కోరేవారు రెండు తెలుగు రాష్ట్రాలను కోరేవారిని లేక ఆ కోర్కెను విమర్శించినందువల్ల ప్రయోజనముండబోదు. సరియగు వివరాలు అంచనాలతో ఒక రాష్ట్రంవల్ల కలుగబోయే లాభాలను ప్రయోజనాలను వివరించి చెప్పాలి. రెండు తెలుగు రాష్ట్రాలవల్ల తెలుగువారు పూర్వం వలె బలహీనంగానే ఉండిపోయి మూడవవారు లాభం పొందగలరు. వీరి ప్రయోజనాలకు భంగం వాటిల్లకలదు. రెండు రాష్ట్రాలవల్ల ఒకరినొకరు వీరు పరస్పరం అర్థంచేసుకొనలేక పోతారు. జాతీయ విషయాల నిర్ణయంలో వీరి మాటకు తగినవిలువ ఉండబోదు. మూడున్నర కోట్ల ప్రజలకు ప్రాతి

జర్నలిజం కోర్సు

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏర్పాట్లు

హైద్రాబాద్, జూన్ 21

జర్నలిజం (పత్రికా రచన)లో ఈ సంవత్సరమే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిప్లొమా కోర్సు ప్రారంభించబడుతుంది.

ఈ కోర్సు వివరాలను రూపొందించడానికి గాను ఇండియానా పోలిస్ (అమెరికా)లోని బట్లర్ యూనివర్సిటీలో జర్నలిజం ప్రొఫెసర్ గా పని చేసిన డా॥ డిఫార్స్టు ఓడెల్‌తో బాటు ఒక కమిటీ నియమించబడింది. ఈ కమిటీలోని యితర సభ్యులు నా గపూర్ హిమత్ కళాశాల ప్రొఫెసర్ హార్వే కౌంగ్స్; శ్రీ సి. హనుమంత రావు (ఢిల్లీ), సమాచార పౌరసంబంధ శాఖ డైరెక్టర్ శ్రీ వినోద్ రావు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఈశ్వరరాజ్ సుధూర్, గోలకొండ పత్రికా సంపాదకుడు శ్రీ ఎన్. నరోత్తమ రెడ్డి, యూనివర్సిటీ ఆర్ట్సు అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ॥ దోరైస్వామి గారలు.

వార్తల నివేదన (విలేఖరిత్వం), ఎడిటింగ్ సంపాదకీయ రచన తదితర పత్రికారచన విభాగాలన్నీ ఈ కోర్సులో బోధింపబడుతాయని తెలుస్తున్నది. నిలబడు, కోర్సు పరిమితులను పై కమిటీ రూపొందిస్తుంది.

మెట్రిక్యులేట్లు అయిన ప్రస్తుత జర్నలిస్టులకు ఉపయోగపడేటట్లు రెండు సంవత్సరాలు గాక ఒక సంవత్సరంలోనే కోర్సు పూర్తి అయేటట్లు తక్కువ ట్యూషన్ ఫీజుతో యిట్టి తరగతులు ఏర్పాటు చేయడం ఉత్తమంగా ఉండగలదని జర్నలిస్టులు భావిస్తున్నారు. ప్రస్తుత జర్నలిస్టులకు ఈ విధమైన శిక్షణ యివ్వడం రాష్ట్రంలోని పత్రికా రచనస్థాయి ఎక్కువ కావడానికి దోహదం చేయగలదని భావింపబడుతున్నది. (స్వ.వి.)

లైసెన్సుఫీజు తగ్గింపు

సికింద్రాబాద్, జూన్ 21

కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ శాఖ రేవన్ ప్రకారము సేల్స్‌టాక్సుపుబట్టి లైసెన్సు రుసుమును రు. 1,500 నుంచి రు. 1,000 వరకు తగ్గించుటకు హాయిద్రాబాద్ ఆర్థికమంత్రి అంగీకరించినట్లు తెలియవచ్చింది.

కాని ఈ రు. 1,000 కూడా భారముగానే యున్నదని అది పాత పద్ధతి ప్రకారం రు. 750 లకు తగ్గించదగునని ఛేదరేషన్ తలపోస్తున్నది (యు.పి.ఐ.

శవపరీక్ష

ప్రాచీన ఆయుర్వేద విధానం

హైద్రాబాద్, జూన్ 21

ప్రాచీనకాలమున ఆయుర్వేద శాస్త్రము బోధింపబడినతర్వాత శారీరిక విషయములను ప్రత్యక్షముగదృష్టాంతపరచి నిస్సందేహముగా దృఢతర జ్ఞానము కలుగుటకుగాను "వైద్యాచార్యులు" శవచ్ఛేదనముగావించి శారీరిక విషయబోధన గావించుచుండిరి. ఇందులకు ఆధునికవైద్య కళాశాలలందు ఉపయోగింపబడుచున్నటుల రోగభూయిష్ఠములయిన మానవకళేబరములను ఉపయోగించేవారు. ముఖ్యంగా దీర్ఘవ్యాధులచేత పీడింపబడి మరణమునొందనట్టియు,సంపూర్ణావయవములుకలిగి మన్యావయస్కులయి మరణముచెందిన వారికళేబరములను ఉపయోగించి పరిశోధనలు జరుపుచుండినటుల సుశ్రుతవాక్యములనుండి తెలియుచున్నది. శవచ్ఛేదనాచారము సుశ్రుతుల కాలమునాటికే వైద్యాచార్యులచే నాచరింపబడియున్నటులను సుశ్రుతులుకూడ శవచ్ఛేదనగావించియే శారీరకవిజ్ఞానమును సంపాదించియున్నటుల స్పష్టీకృతమగుచున్నది. ఇట్టిపరిశోధనలచే మనప్రాచీనులు, శరీరమందలి రసరక్తాదిధాతువుల పరిమాణమును కనిపెట్టిరి. అస్థి, కండర ఆశయ, సిరా, ధమన్యాదులసంఖ్యను వాటిభేదములను, వాటికర్మలనువివరముగ వర్ణించిరి. ఇంతయేగాక ఆధునిక శారీరక శాస్త్రవేత్తలచే నంతగ పరిశోధన గావింపబడని మర్మవిజ్ఞానము మన ప్రాచీనులు అత్యద్భుతముగ వర్ణించిరి. శారీరకవిషయములు ఆయుర్వేదగ్రంథములందు సూక్ష్మతరముగ వర్ణింపబడియున్నవి. సుశ్రుతులు శస్త్రయంత్రకర్మలను అభ్యసించుటకు జంతుకళేబరములను ఉపయోగించేవారని యితనికాలమున పాశ్చాత్యదేశములలో శవచ్ఛేదనాచారము అమలులోలేదు. ఆయుర్వేదసంహితనుబట్టియే పాశ్చాత్యులు శవచ్ఛేదనాచారములు తెలుసుకొన్నట్లు కొన్నిగ్రంథములలోకలదు.

అలెగ్జాండరు గురువుయొక్క పోత్సాహమువలన ఆపట్టణమున ఒకవైద్య కళాశాల స్థాపింపబడెను. ఇచ్చటి ప్రవేశమున మానవశవచ్ఛేదనాచారము అమలుపరచినట్లు ప్రాశ్చాత్యవైద్య చరిత్రలో తెలుపబడినది.

ప్రస్తుతము ఆధునికవైద్య కళాశాలలందు బోధింపబడినట్టి శవచ్ఛేదనాచారము మన ఆయుర్వేదశాస్త్రముల దేనినిన ఆశ్చర్యముకలుగక మానదు.

"భగీరథ"

ప్రాజెక్టుల మాస పత్రిక

న్యూఢిల్లీ, జూన్ 27

ఇండియాలోని ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల అభివృద్ధికి కృషిచేసే నిమిత్తం ఇండియా ప్రభుత్వ ఇరిగేషన్ శాఖవారు త్వరలోనే వస్తున్న 'భగీరథ' అనే మాసపత్రిక ఈ నెలలో వెలువడుతుంది. భారతదేశంలో నిర్మించబడుతున్న నదీలోయ ప్రాజెక్టులను గురించి, వాటి అభివృద్ధిని గురించిన అధికారపూర్వకమైన సమాచారం ఇరిగేషన్ మంత్రిత్వ శాఖవారి నిర్ణయాలు ప్రకటనలు ఆప్రతికలో ప్రకటింపబడతాయి. సాధారణ పాఠకులకుసైతం అర్థమయ్యే శైలిలో రచనలు సాగించబడుతాయి.

పెద్ద ప్రాజెక్టులవల్ల కలిగే ప్రధాన జనాలను ప్రజలకు విపులంగా తెలియచేయాలని, వాటిని విరివిగా ప్రచారం చేయాలని ఇటీవల పార్లమెంటు సభ్యులు బయటకూడ అందోళన సాగించబడింది. ఈ పత్రిక తొలి సంచిక ఈ వారంలో వెలువడుతుంది. భాక్రానాంగల్ ప్రాజెక్టును గురించి, కొన్ని రాష్ట్రాలలో ప్రాజెక్టుల అభివృద్ధిని గురించి కొన్ని వ్యాసాలు, కొన్ని ప్రభుత్వ ప్రకటనలు తొలి సంచికలో చేర్చబడ్డాయి.

ఈపత్రిక అందరికీ అందుబాటులో వుండే నిమిత్తం సంవత్సరానికి 3రూపాయలచందా నిర్ణయించబడింది. విద్యార్థులకు, గ్రంథాలయాలకు, సాంకేతిక శిక్షణకేంద్రాలకు సూటికి 25 వంతులు మినహాయింపు వుంటుంది. ఈ సంచికప్రతులు కావలసిన వారు డైరెక్టరు, పబ్లికేషన్సు డివిజన్, మినిస్ట్రీ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగు, ఢిల్లీ అనిప్రాసి తెప్పించుకోవచ్చును.

ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షల ప్రారంభం

హైద్రాబాద్, జూన్ 21

ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు 61 కేంద్రాలలో ప్రారంభమైనవి. ఈ కేంద్రాలు, తెలంగాణ, బొంబాయి రాష్ట్రాలు, కర్నూలు, నెల్లూరు, సంద్యాల ప్రాంతాలలో కలవు.

హైదరాబాద్‌లో ఈ పరీక్షలు చాదర్‌ఘాట్ కాలేజీలో జరుపబడుచున్నవి. ఇక్కడి పరీక్షా విధానాన్ని శ్రీ గోపాల్‌రావు ఎక్బోటే (విద్యా, స్థానిక స్వపరిపాలనా మంత్రి) గారు చూచి తమ సంతృప్తిని వెల్లడించారు.

(ఎ. ఎన్. ఎస్)

అహమ్మద్ రేడియో కేంద్రం

శక్తివంతమైన ట్రాన్సుమిటర్ స్థాపన

న్యూఢిల్లీ, జూన్ 21

"భారతదేశంలో రేడియో కేంద్రాలను విస్తృతంచేసి ఎక్కువమంది శ్రోతలకు రేడియోసౌకర్యాలు లభించేటట్లు చేయడం మనపంచవర్ష ప్రణాళిక యొక్క ప్రధానలక్ష్యం" అని ఇండియాప్రభుత్వ రేడియో, సమాచార శాఖ మంత్రి డాక్టరు బి.వి. కేస్కర్ గతవారం అహ్మదాబాద్ చేరువలోని బారిజా అనేచోట 50 కిలోవాట్ల మీడియమ్ వేవ్ ట్రాన్సు మిటరుకు ప్రారంభోత్సవం జరుపుతూ అన్నారు.

ఆనందర్భంలో డాక్టర్ కేస్కర్ ఇంకా ఇలాఅన్నారు:

"శక్తివంతమైన 50 కిలోవాట్ ట్రాన్సుమిటర్లను నెలకొల్పడమే గాక ఇంకా అనేకచోట్ల అనేక ట్రాన్సుమిటర్లను నెలకొల్పడానికి ప్రణాళికలు సిద్ధపరచబడ్డాయి, పార్టువేవ్ ట్రాన్సుమీటర్లంత దూరం మీడియమ్ వేవ్ ట్రాన్సుమిటర్లు ప్రసారం చేయలేకపోయినా మీడియం వేవ్‌లోనుట్టంగా ప్రసారాలను వినవచ్చును. ఇందోర్, జైపూర్, పాట్నా, ముద్రాసు, హయిదాబాద్, విజయవాడ, త్రివేంద్రం, ఢిల్లీలలో 20 కిలోవాట్ ట్రాన్సుమిటర్లు, కటక్‌లో 10 కిలోవాట్ ట్రాన్సుమిటర్ పూనాలో 5కిలోవాట్ల ట్రాన్సుమిటరునెలకొల్పబడనున్నాయి. పైన పేర్కొనబడిన కారణాలవల్లమీడియం వేవ్ ట్రాన్సుమిటర్లనే నెలకొల్పడానికి నిర్ణయించబడింది. అదిగాక మీడియంవేవ్ రేడియో సెట్టు అప్పటికంటే తక్కువ ఖరీదు.

"ఆధునిక ప్రపంచంలో రేడియో అతిశక్తివంతమైన సాధనం. రేడియో ప్రసారాలను ప్రపంచంలో ఎక్కడైనా వినవచ్చును. విద్యాభివృద్ధికి, వినోద కాలక్షేపాలకు, సంస్కృతి పరిరక్షణకు రేడియో కంటె ఉత్తమమైన సాధనం మరికొకటి లేదు జాతీయ పునరుజ్జీవన కార్యక్రమంలో రేడియో సముచిత పాత్రనునిర్వహించాలి.

"శక్తివంతమైన ట్రాన్సుమిటర్లు వివిధ ప్రాంతాలలో నెలకొల్పబడిన తర్వాత ఈకృషిని విజయవంతంగా సాగించడానికి అవకాశముంటుంది."

బొంబాయి ముఖ్యమంత్రి శ్రీమొరార్జీదేశాయి ఈక్రింది సందేశం పంపారు. "ఒకప్పుడు మనగ్రామాలజానపద సంగీతం, నృత్యాలలో నిండివుండేవి. ఇప్పుడవన్నీ క్షీణించిపోయాయి రేడియో కేంద్రాలు ఆకళలను పునరుద్ధరించడానికి పూనుకోవాలి. రేడియో అధికారులు గ్రామగ్రామాన పరిశోధన సాగించి వాటిని సేకరించాలి."

కేంద్ర డిప్యూటీ ఆర్థికమంత్రి శ్రీ యమ్.సి. పా ఇలాఅన్నారు.

"పరిక్ష రాస్యులుఎక్కువగావున్న మనదేశంలో వినడంవల్ల విజ్ఞానాన్ని అభివృద్ధిచేయడానికి వీలుకుంది శక్తివంతమైన ట్రాన్సుమిటరు నెలకొల్పడం వల్ల ఇది ఇక్కడ ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడగలదని భావిస్తున్నాను"

హైద్రాబాదు గంగపుత్ర సమావేశం

హయిద్రాబాదు, జూన్ 21

హయిద్రాబాదురాష్ట్ర గంగపుత్ర సమావేశం, తుల్జాభవనంలో జూన్ 25, 26, 27 తేదీలలో జరుగగలదు. శ్రీ ఎస్. బాలయ్య ఈ సమావేశానికి అధ్యక్షతవహిస్తారు.

25 జూన్‌న ఉదయం 8 గంటలకు భారతవతాకోత్సవంతో సమావేశము ప్రారంభమౌతుంది. పతాకాన్ని డా॥ జి. ఎస్. మేల్కోటేగారు ఎగురవేస్తారు.

ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు, రెవిన్యూమంత్రిఅయిన శ్రీ కె. వి. రంగారెడ్డిగారు ప్రారంభోపన్యాసాన్నిస్తారు.

ఈ సమావేశ బహిరంగసభ జూన్ 27 న సాయంత్రం 6 గంటలనుండి 9 గంటలవరకు జరుగును. 300 మంది దాకా డెలిగేట్లు ఈ సమావేశములో పాల్గొనగలరు. (ఎ. ఎన్. ఎస్)

శ్రీ తెన్నేటి విశ్వనాథం

హయిద్రాబాదు, జూన్ 20

ఆంధ్ర ప్రభుత్వ ఆర్థికశాఖామంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు, నిన్న ఇక్కడి ఆంధ్రసారస్వతపరిషత్తును దర్శించారు. (ఎన్- ఎన్ ఎస్-)

శ్రీదాతార్ బౌరంగాబాద్ పర్యటన

బౌరంగాబాద్, జూన్ 21

కేంద్ర హోంశాఖా ఉపమంత్రి శ్రీ బి. ఎన్. దాతార్ తమ బౌరంగాబాద్ పర్యటనలో చాలా గ్రామాలను దర్శించారు. వీరు 400 మైళ్ళదాకా పర్యటించారు. వీరు హరిజనకాలనీలను కొన్ని నిర్మాణంలోనున్న ప్రాజెక్టులను కూడ దర్శించారు.

వారి పర్యటన సెంట్రలుజైలు దర్శనతో ప్రారంభమైంది. వారు భారత పతాకను అక్కడ ప్రతిష్ఠించారు. ఆయన ఇక్కడ మాట్లాడుతూ యిప్పుడు జైలులోనున్నవారు, తాము విముక్తులైనతోడనే చిత్తశుద్ధితో ఉత్తమపౌరులుగా తయారు కావాలని చెప్పారు. అధికారులుకూడా వారలను నీతిదాయకులుగ మార్చుచేయుటకు ప్రయత్నించాలని కూడ వారన్నారు.

డిప్యూటీ మంత్రిగారు బీర్ దర్శించారు. అక్కడి ప్రజలాయనకు ఘనమైన స్వాగతమిచ్చారు. పింపరిగ్రామ పర్యటనలో యివ్వబడిన స్వాగతంలో ప్రజలనుద్దేశించిహరిజనోద్ధరణకై ప్రజలు ప్రయత్నించాలని కోరారు. జిరాయిలో 2000 గ్రామస్తులు పూరేగింపుతో యీయనకు స్వాగత మిచ్చారు. హైద్రాబాద్ హోంశాఖా ఉపమంత్రి శ్రీనివాసరావ్ ఎకిలీకర్‌తో కలసి యీయన బీడ్ లోని మిషన్సుకోర్టును దర్శించారు. కోర్టులాయరులు యిచ్చిన స్వాగతంలో ప్రసన్నసిన్హా, రోజువారీ జరిగే లెజిస్లేటివ్ అసెంబ్లీ, పరిషత్ పార్లమెంట్ కార్యకలాపాలను పరిశీలిస్తూ, తమ బాధ్యతాయుతమైన కార్యనిర్వహణలో న్యాయవాదులు జాగ్రత్త వహించాలనియు, అమాయకులకును, ప్రజలకును న్యాయం చేకూర్చుటలోను నేరస్తులను శిక్షించుటలోను వీరుసాయపడాలని చెప్పారు.

తరువాత 200 మైళ్ళ పర్యటనలో మోమినాబాద్, పర్లి తాలూకాలు దర్శించారు. అక్కడి హరిజనవాడలు చూచిన తరువాత, అవి శుభ్రంగావుంచబడాలని కోరారు. వయోజనవిద్యావసరాన్నిగుర్తించాలన్నారు. తరువాత శ్రీదాతార్ మోమినాబాద్‌లోనిఅంధజోగై దేవతయొక్క దేవాలయాన్ని దర్శించి, దేవతయొక్క ఆస్థానంలో అందరు మానవులు సమానులనియు, దేవాలయ ద్వారములు హరిజనులకు కూడ తెరువబడాలనియు, కోరారు. పూర్వం హిందూమతంలో హరిజనులకు గూర్చబడిన న్యాయం నిస్సహాయంబడి, వారి ఉద్ధరణకైదేవత ఆశీర్వదించాలని కూడ వారు కోరారు.

తరువాత ముకుందరాజ్ సమాధి దర్శించారు. అక్కడి హైడ్రోఎలక్ట్రిక్ స్కీము వివరాలను తెలుసుకొన్నారు. పర్లి, పోలాపూర్‌లను రైలుమార్గం ద్వారా కలిపేప్రయత్నాలను పరిశీలించాలని వారిని నారాయణ్‌రావ్ జోషిగారు కోరారు.

తరువాత పర్లి విజయనాథ్‌ను దర్శించి అర్చనలు జరిపించారు. ఇటువంటి పుణ్యక్షేత్రాలను కల్గియున్నందుకు ప్రజలుఅదృష్టవంతులనివారన్నారు. ఇక్కడ దేవాలయాధికారులిచ్చిన స్వాగతాన్నందుకొని మాట్లాడుతూ, ఈప్రజా స్వాతంత్ర్యశ్రీనెహ్రూకుకూడా తానుఅందజేయగలననియు వీరన్నారు. విజయనాథ్ ఒక గొప్ప పుణ్యక్షేత్రమే కాని ప్రజలు మహాత్మా గాంధియొక్క ఉపదేశాలనుకూడపాటించడంద్వారా మానవసేవకుగడంగాలి అప్పుడే ప్రతి మతంయొక్క సారాన్ని గ్రహించిన వారమౌతామని కూడ వారన్నారు.

బెల్లాసురప్రాజెక్టువద్దమున్నక్షయ నిర్మూలనా కేంద్రాన్నికూడ దాతార్ గారు దర్శించారు.

హైద్రాబాద్ ప్రభుత్వ హోం కార్యదర్శి శ్రీచంద్రకాంతరావ్‌గాడ్సే గారి బీట్‌లోని భవనంలో వీరువిందారగించారు. (ఎ. ఎన్. ఎస్)

విశాలాంధ్రకు ముస్లిం సహకారం

హయిద్రాబాద్, జూన్ 21

2,18,000 సంఖ్యగల హయిద్రాబాదులోని నెలకొలిపబడిన ముస్లింతరగతులవారు తమపూర్తి సహకారాన్ని విశాలాంధ్రనిర్మాణంలో యివ్వాలనని చెప్పారు.

ఆంధ్ర ఆర్థికమంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు వారి రక్షణకైయిచ్చిన హామీపై ఈ నిర్ణయానికివచ్చారు.

ఈ నెలకొలిపబడినసంఘం విశ్వనాథంగారికి సమర్పించినపట్టికలో 18 ముస్లిం నెలకొలిపిన తరగతులు చేర్చబడ్డాయి. (ఎ. ఎన్. ఎస్.)

గోధుమ పరిశోధన కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 21

న్యూఢిల్లీలోని భారతీయవ్యవసాయ పరిశోధన కేంద్రంవారు సిమ్లాలో గోధుమ పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పారు. ఇప్పుడు ఆ కేంద్రం సిమ్లాలో క్రొత్తభవనంలోకి మార్చబడింది.

భారతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంవారు చాలా కాలంవరకూ ఈ గోధుమ కేంద్రం నిర్వహణకు ధనసహాయాన్ని సమకూర్చారు. ఆ కేంద్రం యొక్క శాశ్వత ప్రయోజనాన్ని గుర్తించి ఇండియా ప్రభుత్వమే దానిని ఇప్పుడు తీసుకొన్నది. కేంద్ర ప్రభుత్వ ఆహార వ్యవసాయ మంత్రిత్వ శాఖవారు దేశవ్యాపంగా నెలకొల్పుతున్న ప్రాంతీయ పరిశోధన కేంద్రాలలో ఇది ఒకటి.

శ్వాటిమాలాపై విమానదాడులు

శ్వాటిమాలా, జూన్ 21

శ్వాటిమాలా పట్టణంపై నిన్న జరిగిన దినం గుర్తింపుకు వీలులేకుండా చిహ్నాలు గల రెండు విమానాలు బాంబులు జేశాయి మెషీన్‌గన్‌లతో దాడి చేశాయి.

విమానాలతో జరిగిన ఈ దాడి మూడవ మారుడి. శుక్రవారం మధ్యాహ్నం కొన్ని దాడులు జరిగినవి. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కూడా దాడులు జరిగాయి. విమానాలుప్రభుత్వకార్యాలయాలుమరియు ప్రయివేటు ఇండ్లపైకూడా దాడిచేశాయి. మిషన్‌గన్‌లద్వారా చేయబడిన కాల్పులవల్ల ఒక బాలికతో సహా ఏడుగురు గాయపడినటుల అధికారికంగా తెలుస్తున్నది. విమానాల ద్వారా కొన్ని గ్రామాలపై ఆయుధాలు మందుగుండు సామగ్రికూడా పడవేయబడుతున్నది. (యు. పి. ఐ)

బి. ఏ. ఎల్. ఎల్. బి. అంధుడు

బొంబాయి, జూన్ 21

ఎల్. ఎల్. బి. పరీక్ష ప్యాసైన అందరవిద్యార్థి రాజేంద్ర జి. వ్యాస్‌ను గురించి మరికొన్ని వివరాలు తెలుస్తున్నవి.

రాజేంద్ర పుట్టు అంధుడు కాడు. బాలుడుగా ఉండగా అతడు చెట్టుకింద నుండిపడి గాయపడ్డాడు. తరువాత అతడు అంధత్వాన్ని కలిగించింది.

దృష్టిలేకపోయినా యితనికి స్థైర్యం లేకపోలేదు. చదువును కొనసాగించడమేగాక యితర కార్యకలాపాలలో ప్రముఖపాత్ర వహించాడు. మెట్రిక్యులేషన్, ఇంటర్, బి. ఏ. పరీక్షలు ప్యాసైనాడు తరువాత ఒకేసారి ఎల్. ఎల్. బి. ఎం- ఏ. పరీక్షలకు హాజరుకావాలను కొన్నాడు. కాని ఒక్కలాపరీక్షకు హాజరుకావడానికే అతడు అంగీకరించబడినాడు.

ఇతడు అనేక యితర కార్యకలాపాలలో పాల్గొన్నాడు. ఇతడు ఇస్మాయిల్ యూసుఫ్ కళాశాలనుండి పట్టభద్రుడయినాడు. ఆ కళాశాల ప్రతినిధిగా వక్తృత్వపోటీలలో [బాలోర్న్ ట్రోఫీ, బాబూభాయి ట్రోఫీ]పాల్గొన్నాడు. అందు ఒకదానిలో ప్రథమబహుమతి, రెండవదానిలో ద్వితీయ బహుమతి పొందాడు. ఇస్మాయిల్ యూసుఫ్ కళాశాల మూసివేయబడుతుండగా తన నాయకత్వంలో అందోళన జరిపి అది మూసివేయబడకుండా చేశాడు. అతడు అనేక సంఘాలకు కార్యదర్శి. అంధుడయినా రేడియో ఎలక్ట్రానిక్స్‌లో చాల శ్రద్ధ తీసుకొంటాడు.

బ్రెయిల్లీద్వారా రాజేంద్ర చదువుతాడు. అతనికొరకు పుస్తకాలు చదువబడుతాయి. పరీక్షలలో జవాబులను ఇతడు బ్రాసేవానికి డిక్టేట్ చేస్తాడు. ~~అంజనేయుని ఆలయమునకు~~

రోడ్డునిర్మాణము

భువనగిరి, జూన్ 21

భువనగిరి దక్షిణంవైపునగల గిరి వద్దనున్న ఆంజనేయ ఆలయమునకు భక్తులు పోవటానికివర్షాకాలములోయిబ్బందిగా యుండెడిది. అట్టియిబ్బందిని దూరముచేయుటకు అబ్కారీకంట్రాక్టరు శ్రీకిషన్‌రావుగారు రోడ్డునిర్మించుటకు వాగ్దానము చేసిరి. ఆ వాగ్దానము ప్రకారము రోడ్డునిర్మాణము ప్రారంభింపబడినది.

ఈదేవాలయములో పూజచేయు పాత్రములదొంగలు 13-5-54 నాడు దొంగిలించుకొని పోయినారు. తిరిగి పూజకొరకు శ్రీముఖ్యాలక్ష్మయ్యగారు కొంత పాత్రసామగ్రి ఇచ్చినారు.

దినదినమునకు ఇంక స్పష్టమైనటువంటియు, ఇంక మనోహరమైనటువంటియునైన చర్మము

రేడియంతోగూడిన రెక్సోనాతో

ఈ అద్భుతమైన మార్పును మీరు తెచ్చుకొంటారు

రెక్సోనాయొక్క రేడియంతో గూడుకొన్న సరగను మీ చర్మము మీద మెల్లగా రుద్ది తరువాత కడిగివేయండి. మీ చర్మము దినదినమునకు ఇంక మృదువుగాను, ఇంక మెత్తగాను అగుటను మీరు చూస్తారు. మరియు మీరు క్రొత్త ఆకర్షణను తెచ్చుకొంటారు.

రెక్సోనా

రేడియంతో గూడిన సబ్బు

చర్మమును పోషించేటటువంటియు, చర్మమును మెత్తగాచేయునటువంటియునైన మూలిక ఒక ప్రత్యేక మిశ్రమమునకు రిజిస్టర్డ్ పేరు.

నేటిరాత్రి నేటిరాత్రి

ప్రకాశ్ పిక్చర్స్ వారి కానుక.

"బాలానందం"

(తెలుగు)

బూరెల మూకుడు కొంటె కిష్టయ్య

రాజయోగం.

బడికి పొయ్యే పిల్లలచే నటించబడినది.

మీ కుటుంబములో ప్రతి వ్యక్తి చూడవలసిన చిత్రం.

సాగర్ హైద్రాబాద్

చిత్ర సికింద్రాబాద్

చమ్రియా రిలీజ్.

నేటిరాత్రి నేటిరాత్రి

'శోభ'

తారలు: ఉషాకిరణ్, సుమంత, మంజు.

లిబర్టీ

హైద్రాబాదు.

నేడు 2 ఆటలు: 6-30, 9-30 గం॥

చమ్రియా రిలీజ్.

నేటిరాత్రి నేటిరాత్రి

మనోహర పిక్చర్సువారి

'మనోహర'

రాయల్ క్రిష్ణ హైద్రాబాదు (హిందీ)

ప్యారడైస్ సికింద్రాబాదు (తెలుగు)

పోతపోసియుంచిన కాంక్రీటు యిటుకలు



మీ అవసరానికి తగ్గుగానున్న ఫ్లాటుకు వద్దగాని టీలర్ వద్దగాని లేక నేరుగా

ది సిమెంటు మార్కెటింగు కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్.

66 A రాష్ట్రపతిరోడ్డు సికింద్రాబాదు (దక్కన్) వారివద్దగాని బుక్ చెయ్యండి.

కాంక్రీటు నిర్మాణమందుగల చిక్కులన్నిటికి ఉచిత సాంకేతిక సహాయము కాంక్రీటు అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుగర్ కంపెనీ బిల్డింగు, బెంగుళూరు వారివద్ద లభించును

SISTA'S CMI-152 Telugu

విశాలాంధ్రమా? రెండు తెలుగు రాష్ట్రాలా?

రాష్ట్ర తెలుగుప్రజల అభిప్రాయం రెండు రాష్ట్రాల మొగ్గుచూపుతున్నది

(మా ప్రత్యేక విలేఖరి)

హయిదరాబాద్, జూన్ 21

భారతదేశంలోని తెలుగు ప్రాంతాలను రెండు రాష్ట్రాలుగా విభజించాలని పి.సి.సి. తెలంగాణ ప్రతినిధుల సమావేశంలో మంత్రి చెన్నారెడ్డిగారు ప్రతిపాదించిన తీర్మానంపై వివిధ వ్యాఖ్యానాలు, కొన్ని తప్పుడు ఊహాగానాలు బయలుదేరినవి. ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారు రెండు తెలుగు రాష్ట్రాల తీర్మానాన్ని బలపరుస్తారనీ అని కూడా ఆ సమానాలు ప్రకటితమైనవి. ఈవిషయాలపై అభిజ్ఞవర్గాలలో విచారించగా ముఖ్యమంత్రి రామకృష్ణారావుగారు పి.సి.సి. అధ్యక్షులు, రెవెన్యూ మంత్రి అయిన రంగారెడ్డిగారు వీరి అనుయాయులైన ఉపమంత్రులు, శాసన సభ్యులు తదితరులుకూడ రెండు తెలుగు రాష్ట్రాల వాదాన్నే బలపరుస్తున్నారని తెలిసింది. విశాలాంధ్రను వీరంతా వ్యతిరేకిస్తున్నారని ప్రభుత్వమంగ్రా గోలకొండ పత్రిక ప్రకటించడం పాఠకులకు విదితమే.

మొన్న ఢిల్లీకు డియక్కడికి వచ్చిన ఆంధ్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు రెండు తెలుగురాష్ట్రాల వాదాన్ని ఖండిస్తూ చేసిన ప్రసంగాలు కూడ ఈ వర్గాలలో విమర్శకు గురియైనవి. ముఖ్యంగా నిజాం నవాబును గవర్నరుగా అంగీకరించడానికి ఆంధ్ర ప్రభుత్వం నమ్మతించడం యిక్కడ అన్నివర్గాలలోఆశ్చర్యాన్ని కలిగించింది. రాష్ట్రంలోని కాంగ్రెసు, ప్రజాసోషలిస్టు, కమ్యూనిస్టుఅనే విభేదాలతో నిమిత్తం లేకుండా సర్వపక్షాలూ నిజాంనవాబును పదవీ చ్యుతుని గావించాలంటున్నాయి. నిజాం రాష్ట్రాన ప్రజలకు లోగడచేసిన ద్రోహం దృష్ట్యా అతనిని 'దైవంపడమే పరమార్థం' అన్న పక్షాలు గుర్తించినవి. నిజాము గవర్నరుగా అంగీకరించడం వలన విశాలాంధ్రం తొందరగా వస్తుందని ఆంధ్ర ప్రభుత్వం భావించి ఆ విధంగా మెజారిటీకు సమర్పించి యుండవచ్చునని యిక్కడ భావించబడుచున్నది.

రెండు తెలుగు రాష్ట్రాల వాదం ఢిల్లీలో ఎవరికీ నచ్చలేదని విశ్వనాథంగారు ప్రకటించడం మరింత విమర్శకు గురిఅయింది. విశ్వనాథంగారు ఢిల్లీలో ఈ విషయమై నెహ్రూ, రాజేంద్రప్రసాద్, కట్జూలతో చర్చించారా? లేక అక్కడ తన మిత్రులైన ఆంధ్ర ప్రముఖుల అభిప్రాయాలను పేర్కొన్నారా? అని ప్రశ్నించబడుతుంది.

రెండు తెలుగు రాష్ట్రాలవాదాన్ని మార్చుకొని విశాలాంధ్రను బలపరచవలసిందిగా విశ్వనాథంగారు చేసిన విజ్ఞప్తి ఏమాత్రం పనిచేయలేదు. తమ వాదాన్ని మార్చుకోనవలసిన అవసరం కలగలేదని రెండురాష్ట్రాల వారులు అభిప్రాయపడుతున్నారు.

విశాలాంధ్ర పట్ల తెలంగాణ ప్రజలలో ఏ మాత్రం సుముఖీ భావం లేదని రెండు తెలుగు రాష్ట్రాలవారులు చెబుతున్నారు. హయిద్రాబాద్ నగరంలో అప్పుడప్పుడు జరిగేసభలు, సమావేశాల నంరంభం మినహా తెలంగాణ జిల్లాలలో, గ్రామాలలో ఈ విషయమై ఏ విధమైన చైతన్యం లేకపోవడాన్ని వారు పేర్కొంటున్నారు.

ఇక్కడ జరిగే విశాలాంధ్ర మహాసభలకు వచ్చేవారిలో ఎక్కువ మంది గైరుముల్కీలని చెప్పబడుతున్నది. నిన్న ప్రతాపగిర్జీ కోఠీలో విశాలాంధ్ర మహాసభ వారు ఏర్పాటుచేసిన సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ శ్రీఅహ్మద్ అలీఖాన్, మేయర్ శ్రీధరణీధర సాంఘికారలుఉర్దూలోప్రసంగిస్తుంటే చాలమంది సభనుండి వెళ్ళిపోవడం (గైరు ముల్కీలకు ఉర్దూ రాదుగనుక) ఈ సందర్భంలో ఉదాహరించబడుతున్నది. హయిదరాబాద్ రాష్ట్రంలో ఉద్యోగాలుచేస్తున్న గైరుముల్కీలలో అధిక సంఖ్యాకులు నగరంలోనే ఉన్నారు.

ముల్కీ సర్టిఫికెట్లు తదితర నిబంధనలు తొండగా యిప్పుడే ఆంధ్రరాష్ట్రంలోని వారు చాలమంది యిక్కడికి వచ్చి దొంగముల్కీ సర్టిఫికెట్లతో ఉద్యోగములు సంపాదించి పౌనులకు తీరని అన్యాయంచేస్తుండగా ఇక విశాలాంధ్రమేవస్తే పరిస్థితి మరీ విషమ రూపం దాల్చగలదని చెప్పబడుతున్నది.

లోగడ విశాలాంధ్రను బలపరుస్తూ వచ్చినవారిలోకూడ కొందరు యిప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల వాదానికి అనుకూలంగా తమ అభిప్రాయాలను మార్చుకొన్నారని చెప్పబడుతున్నది.

రెండు తెలుగు రాష్ట్రాల స్వరూపం మయమై తెలంగాణను విభజించాలనేఉద్దేశం ఏమాత్రంలేదని తెలంగాణ 9 జిల్లాలు, రాయలసీమ, గుల్బర్గా, బీదర్ నాందేడు జిల్లాలలో మొత్తం 8 తాలూకాలు యింకనూ మధ్య ప్రదేశ్‌లోని చాందా, బస్తర్‌లోని తెలుగు ప్రాంతాలు చేర్చితే ఆంధ్ర రాష్ట్రంతో సమానమైన విస్తీర్ణము కలిగిన స్వయం పోషకమైన రాష్ట్రం ఏర్పడగలదని చెప్పబడుతున్నది.

హయిద్రాబాద్, సికింద్రాబాద్ నగరాలను ప్రత్యేకంగా చీఫ్‌కమీషనర్ రాష్ట్రం చేయాలనే వాదానికి ఏ మాత్రం బలంలేదని అవి తెలంగాణలో అంతర్భాగాలేనని చెప్పబడుతున్నది. సంస్థానాన్ని విభజించరాదని వాదించేవారినంఖ్య బహుస్వల్పమైనా ఆవాదానికిఏమాత్రంబలం లేదని సర్వపక్షాలూ సంస్థానాన్ని విభజించాలని ఏకగ్రీవంగా కోరుతున్నందున రాష్ట్రాల పునర్విభజన కమీషన్ రాష్ట్ర విస్తృతిని సిఫారు చేయక తప్పదని భావించబడుతున్నది.

రెండు తెలుగు రాష్ట్రాలు, విశాలాంధ్రమా అనేవిషయమై తెలంగాణలో ఏ ప్రాంతంలోనైనా సరే రిఫరెండంతీసుకొంటే అధికసంఖ్యాకులైన ప్రజలు విశాలాంధ్రకు వ్యతిరేకంగా తీర్పు యివ్వగలరని నమ్మబడుతున్నది. హయిద్రాబాద్‌లోని ముస్లింలు కన్నడిగులు మహారాష్ట్రులతో అత్యధికసంఖ్యాకులు విశాలాంధ్రకంటె తెలంగాణ రాష్ట్రానికే సముఖంగా ఉంటారని ఈనందర్భంలో చెప్పబడుచున్నది.

రెండు తెలుగురాష్ట్రాల వాదం యిప్పుడే పుట్టలేదని ప్రస్తుత తెలుగు మంత్రులు యితర నాయకుల మనస్సులో కొన్నిసంవత్సరాలుగాఉంటూ వచ్చినదని వారు యింతవరకు ఆ విషయం వెల్లడించకుండా వచ్చారని రాష్ట్రాల పునర్విభజన కమీషన్ ఫ్యతంగా ఇదియిప్పుడు బయట పెట్టవలసి వచ్చినదని తెలుస్తున్నది. ఈవాదాన్ని చెన్నారెడ్డిగారు బయటపెట్టిన తొందరోజులలో ఈవైపు చాల గ్రౌండు పెరిగిపోయిందని మరింత కాలానికి మరింత బలపడగలదని భావించబడుతున్నది.

హైద్రాబాద్ రాష్ట్రంలోకన్నడ జిల్లాలు ఐక్యకర్ణాటకంలో చేరడానికి పనుకాడుతున్నవనిస్పష్టపడింది. మరాట్వాడా జిల్లాలో రాష్ట్ర విభజనానంతరం సంయుక్త మహారాష్ట్రంలోగాని మహావిదర్భంలోగాని విలీనమైతే మిగిలిన రెండున్నర కన్నడజిల్లాలు తెలంగాణతోబాటు ఉండిపోవడం శ్రేయస్కరమని మంత్రి డా॥ మేల్‌కోటే పి. సి. సి. ప్రధాన కార్యదర్శి శ్రీ మల్లప్ప కౌలూరు ప్రభృతులు భావిస్తున్నారని తెలుస్తున్నది.

విశాలాంధ్రం, రెండు తెలుగురాష్ట్రాల విషయమై ప్రజాసోషలిస్టు పార్టీలో ఏర్పడిన విభేదాలు తీవ్రరూపం దాల్చి యితర విషయాలలో కూడ విభేదాలుగా పొడచూపుచున్నవి. విశాలాంధ్రను కోరేవారిపై తెలంగాణ రాష్ట్రాన్ని కోరేవారికి విద్వేషం పెరిగి వ్యక్తిగత వైషమ్యాలకు కూడ దారితీస్తున్నది. కాంగ్రెసులో మాత్రం ఈవిభేదాలు యితర విషయాలలోనికి పోలేదు.

రెవెన్యూశాఖ ఉపమంత్రి

శ్రీ పల్లెర్ల హనుమంతరావుగారు నిన్న బయలుదేరి ఐదురోజులు మెదక్ జిల్లాలో పర్యటించడానికి వెళ్ళారు. ఆయన జూన్ 26 వ తేదీన హయిద్రాబాద్‌కు తిరిగివస్తారు.

ఆసియాలో ప్రజాస్వామ్యరక్షణ

నెహ్రూ దానిరక్షకుడు ఇండియా పెట్టనికోట

పోర్ట్లాండ్, (ఒరెగాన్) జూన్ 21

ఆసియాలో ప్రజాస్వామ్య భవితవ్యత నెహ్రూమీద, భారతదేశంపైన ఆధారపడి ఉన్నదనిడేవిడ్ మాక్స్‌వెల్ ఇటీవల ఒక సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. ఈయన ఫిలడెల్ఫియాలోన్యాయవాది. అమెరికాన్యాయవాదుల సంఘానికి అధ్యక్షుడూను.

ఈ సమావేశానికి 1100 మంది న్యాయవాదులు హాజరయారు. ఈయన ఒక సూచకంపైనే తరపున పనిచేస్తూ ఇండియాలోకొన్ని మాసాలుగడిపారు. "మన విధానాలమీద నెహ్రూచేస్తున్న విమర్శలుగాని, పరస్పర వైరుధ్యాలుగా వుంటున్నట్లు కనపిస్తున్న చర్యలుగాని అమెరికనులను ఎంతగా కలవరపెడుతున్నప్పటికీ అమెరికా మాత్రం నెహ్రూను బలపరుస్తూ వుండాలి. అని ఈయన ఆ న్యాయవాదుల సభలో చెప్పారు. ఈయన ఇంకా ఇలా అన్నారు:

"ప్రజలదారిద్ర్యాన్ని, అజ్ఞానాన్ని మూఢవిశ్వాసాలను పోగొట్టడంలో భారతప్రభుత్వంముందడుగు వేస్తూంది. ఈ కృషి కనుక ఇదే విధంగా కొనసాగినట్టయితే కమ్యూనిజానికి విజయం లభించే అవకాశాలుండవు.

'భారతదేశాభ్యుదయమంతాపంచవర్ష ప్రణాళికపైన ఆధారపడి వుంది కాబట్టి అదివిజయవంతమయేటందుకు గాను అమెరికా సాధ్యమైనంతమట్టుకు సహాయపడాలి.

'భారత రాజకీయరంగంలో కీలక సమస్యగా వున్న ప్రజా జీవన ప్రమాణాభివృద్ధికి కూడా అమెరికా ఈసహాయంద్వారా తోడ్పడుతున్నది.

అమెరికనులను ఆగ్రహపరుస్తున్న పనులను నెహ్రూ చేస్తున్నప్పటికి, ఇండియా నేమి, ఆసియా నేమి కమ్యూనిస్టుల పీడనుంచి తప్పించాలంటే నెహ్రూను అమెరికా బలపరుస్తూండడమొక్కటే ఉత్తమమార్గం.

"పంచవర్ష ప్రణాళిక విజయవంతం చేస్తేనే ఇండియా ఈనాటివలెనే ముందు కూడా స్వతంత్రంగావుండేటట్లు చెయ్యడానికి మనకు అవకాశం వుంటుందని నా గాఢవిశ్వాసం. ఇది ప్రపంచంలోక్కల్లా పెద్ద ప్రజాస్వామ్య దేశం. ఆసియాలో ప్రజాస్వామ్య రక్షణకు అదేఇప్పటికీ ఆశాజ్యోతి."

ఇండియాకు 1955 ఫిస్కల్ సంవత్సరంలో ఆర్థిక, సాంకేతిక సహాయం చెయ్యడానికై విదేశ వ్యవహారాలనిర్వహణ శాఖవారు కోరిన 10,45,00,000 డాలర్లను తప్పకుండా ఇవ్వాలని ఈయన అభ్యర్థించారు.

"ఈ సహాయం మంజూరయినట్టయితే, ఇండియాను నవీనపటుతర ప్రజాస్వామిక దేశంగా పునర్నిర్మించడానికి తోడ్పడుతుంది" అని కూడా వక్కాణించారు.

ఆదర్శగ్రామము పొట్లపల్లి

పొట్లపల్లి, జూన్ 21

పొట్లపల్లిగ్రామము మహబూబునగరంజిల్లాలోనిది. జనసంఖ్య 230 గ్రామభూమి [650] యకరములు భూస్వాములు [22] రక్షితకౌలుదార్లు [8] భూములు లేనివారు స్వల్పము భూమిగల కుటుంబములు 15 నుంచి 19 గలవు. శ్రీనివాసాచార్యులు వారికుమారులు రామాచార్యులు అనంతస్వామిగార్లు భూదానముచేయుటకు సంకల్పించుకొనిరి. భూదానసమితిపక్షమున శ్రీ కేశవరావుగారు సంయోజకులు హయిద్రాబాదు భూదానయజ్ఞసమితి 15,18 కుటుంబములకు భూమి చెందేటట్టు చేసిన యీగ్రామముంతాభూమిగలవారి పల్లెగా ఆదర్శంగాఉండునని కోరగా ఇందుకు స్థానిక భూస్వాములు యజ్ఞయ్య వెంకటాచారిగార్లు సమ్మతించిరి. [52] ఎకరములభూమి పదికుటుంబములకు పంచబడెను. వచ్చేవారములో మిగతకుటుంబములకు భూమి పంచబడునని తెలుపబడుచున్నది. గ్రామస్థులు సమైక్యంగాభూములిచ్చుకొనుట ప్రశంసనీయమైనప్రయత్నం ఇదినఫలమైతే హయిద్రాబాదు రాష్ట్రములో ఈ నమోనాగా వుండగల మొదటిగ్రామం పొట్లపల్లి.

బాలబాలికల పారిశ్రామిక శిక్షణాలయాలు

హయిద్రాబాద్, జూన్ 21

గత సంవత్సరం 1953 సెప్టెంబరు-అక్టోబరుమాసాలలో హయిద్రాబాదు ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖకుచెందిన బాలబాలికల పారిశ్రామిక శిక్షణాలయాలను పునర్వ్యవస్థీకరించడానికి రాజప్రముఖ్ అనుమతించి యుండిరి. ఈ పునర్వ్యవస్థీకరణల ఫలితంగా నిర్మల జాల్నా, బీదర్, పర్భని బాలుర పారిశ్రామిక శిక్షణాలయాలు, నిజామాబాదు, నాందేడు, రాయచూరు బాలుర పాఠశాలలోనూ, పర్భనీవ్యవసాయక శిక్షణాలయంలోను విలీనం చేయబడగలవు. ఇంకా ఏమే పాఠశాలల విలీనాలు మంజూరు చేయబడినవో అవి 1954 సం. జూన్ 16వ తేదీ నుంచి ఆరంభమయ్యే సెషన్ నుండి అమలుకు రాగలవు.

పథకమును అనుసరించి, నిర్మల, జాల్నా, బీదర్, పర్భని బాలుర పారిశ్రామిక శిక్షణాలయాలు, నిజామాబాదు బాలికల పారిశ్రామిక శిక్షణాలయము పైన పేర్కొనబడిన స్థలాలకు మార్చి వేయబడినవి. ఈ విధంగా విలీనీకరణ జరుగడంవల్లనిజామాబాదు నాందేడ్, రాయచూరులలో కొత్తగా బాలుర సాంకేతిక ఉన్నత పాఠశాలలు, పర్భనీలోని వ్యవసాయక ఉన్నత పాఠశాల, గుల్బర్గాలో బాలికలచేతి పనుల శిక్షణాలయము ప్రజాధనంపై అదనపు భారం లేకుండా ప్రారంభించబడినవి. నిర్మల, బీదర్ బాలుర పారిశ్రామిక శిక్షణాలయాలు మూసివేయబడుతున్నప్పటికీ ఈ శిక్షణాలయాలలో బీదరీ పరిశ్రమ, చర్మకార పరిశ్రమ, బొమ్మల పరిశ్రమ, లక్కపరిశ్రమ మొదలైనవాటికి సంబంధించిన విభాగాలు హయిద్రాబాదు చేతిపనుల కేంద్ర శిక్షణాలయానికి ఆయా పరిశ్రమలలో శిక్షణను అభివృద్ధిపరచేఉద్దేశంతో మార్చి వేయబడినవి.

పంచదార ఉత్పత్తి నిలవలు

కొత్తఢిల్లీ, జూన్ 21

ఇండియాలోని పంచదార ఫ్యాక్టరీలలో 1954 మే 16 వ తేదీన 4 లక్షల 70 వేల టన్నులు నిలువవున్నదని, గత సంవత్సరం ఆదేరోజున 9 లక్షల 39 వేల టన్నులు నిలువవున్నదని, 1953 నవంబరు 1 నుంచి 1954 మే 15 వరకూ విదేశాలనుంచి దిగుమతి చేసుకొన్న పంచదార రెండున్నర లక్షల టన్నులనీ తేలింది.

మే 31 తో అంతమయ్యే పక్షం రోజులలో ఇండియాలో ఉత్పత్తి అయిన పంచదార 4 వేల టన్నులు, విదేశాలనుంచి వచ్చిన పంచదార 55 వేల టన్నులు. పంచదారఫ్యాక్టరీల వద్ద నిలవవున్నదానిలో 64 వేల టన్నులు ఆపక్షంలో విడుదలచేయబడింది. గతసంవత్సరం అదేకాలంలో 74 వేల టన్నులు విడుదల చేయబడినాయి. మే 31 న ఫ్యాక్టరీలలోవున్న నిలవ 4 లక్షలు 6 వేల టన్నులు గత సంవత్సరం అదేకాలంలో వున్ననిలవ 8 లక్షల 73 వేల టన్నులు.

1953 నవంబరు 1 నుంచి 1954 మే 31 వరకూ ఇండియాలో ఉత్పత్తి అయిన పంచదార 10 లక్షల 1 వెయ్యి టన్నులు గతసంవత్సరం 12 లక్షల 92 వేల టన్నులు ఉత్పత్తి చేయబడింది. నవంబరు 1 నుంచి మే 31 వరకూ 7 లక్షల 90 వేల టన్నులు విడుదలచేయబడింది. గతసంవత్సరం అదేకాలాన్కి 9 లక్షల 2 వేల టన్నులు విడుదలచేయబడింది.

భార్యహత్య

అహ్మద్‌నగర్, జూన్ 21

ఇక్కడొక నిరుద్యోగియైన యువకుడు డబ్బు విషయమై వివాదపడితన భార్యను హత్యచేశాడు.

శంకర్ గజానన సోనార్ అనే ఈ నిరుద్యోగి తన భార్య సుభద్రతోడబ్బు విషయమై తరచు వివాదపడుతుండేవాడు.

సుభద్ర అరుపులు విని చేటి ఉదయం పొరుగువారు వారి యింటికి వచ్చారు. కుంగిలికత్తితో పీక తెగి రక్తపు మడుగులోపడియున్న సుభద్రి కనిపించింది. శంకర్ అరెస్టుచేయబడినాడు.

కమ్యూనిస్టు ప్రమాదాల్ని

ఆసియా గుర్తించిందని స్ట్రీబెర్టు వివరణ

వాషింగ్టన్, జూన్ 21

దక్షిణ,ఆగ్నేయ ఆసియా దేశాలు స్థానిక కమ్యూనిస్టులవల్ల నిజానికి ఎంత ముప్పువుందో ఈమధ్యకాలంలోగుర్తించాయని అమెరికా సమాచార శాఖ డైరెక్టర్ థియొడోర్ స్ట్రీబెర్టుఅన్నారు. నిన్నను నేషనల్ ప్రెస్ క్లబ్బులో మాట్లాడుతూ ఆయన ఈవిషయాన్ని తెలియజేశారు.

దక్షిణ, ఆగ్నేయ ఆసియాలలో ఇటీవలపర్యటించినప్పుడు తనకు కలిగిన అభిప్రాయాలను గురించి చెపుతూ, స్థానిక కమ్యూనిస్టులవల్ల రాతగ్గప్రమాదాన్ని అక్కడివారు గుర్తించారనీ స్వతంత్ర దేశాలపట్లవారు మొగ్గుచూపుతున్నారనీ ఆయన తెలియజేశారు. ఆయా దేశాలలోని కమ్యూనిస్టుల పలుకుబడి తిరుగుముఖం పట్టిందని తను నమ్ముతున్నానని కూడా ఆయన అన్నారు.

దూరప్రాచ్య దేశాలలో కలోనియలిజంపట్లనున్న తీవ్రమైన వ్యతిరేకతను గురించి ప్రస్తావించి, ఈవ్యతిరేకతను కమ్యూనిస్టులు తమ ఆశయసాధనకు ఉపయోగించుకుంటున్నారని ఆయన తెలియజేశారు. అమెరికా ఉద్దేశాలకు కళంకం ఆపాదించడానికిగానుకమ్యూనిస్టు ప్రచారకులు అమెరికాకు పాతకాలపు కలోనియల్ రాజ్యాలతో గల సాంగత్యాన్ని ఎత్తిచూపుతున్నారని కూడా ఆయన వివరించారు.

స్ట్రీబెర్టు ఇంకా ఇలా అన్నారు. కమ్యూనిస్టు ప్రచారంలోని అసలు రహస్యాన్ని ఆసియానాయకులు గుర్తించడం ప్రారంభించారు. కొత్తరకం కలోనియలిజంవల్లరాతగ్గప్రమాదాన్ని వారు జాగ్రత్తగా గమనిస్తున్నారు. ఉత్కృష్టమైన తమ ప్రాచీన నాగరికతలకు సోవియెట్ యూనియన్ సారథ్యం వహించబోతుంటే వారుచూస్తూ ఊరుకోరని నానమ్మకం.

ప్రపంచ విజయానికి కంకణం కట్టుకున్న ఒక పరాయిదేశం తనప్రజలనుతైవపంచేసుకుని,కమ్యూనిస్టుసిద్ధాంతాలు వారి తలకెక్కించి, తనకోర్కెలీడేర్చుకోనడానికి వారిని సాధనాలుగా ఉపయోగించబోతుంటే వారుచూస్తూ ఊరుకోరు.

కమ్యూనిస్టు ప్రాబల్యంక్రింద లేని ఆసియాలోకల్లా ఇండియా అత్యంత శక్తి మంతమయిందని స్ట్రీబెర్టు అన్నారు. ఇండియాలోని కమ్యూనిస్టులవల్ల రాతగ్గముప్పును ఆదేశం గుర్తించిందనీ, స్థానిక కమ్యూనిస్టులను నిరసిస్తూ ప్రధాని నెహ్రూ చాలాసార్లు మాట్లాడారనీ స్ట్రీబెర్టు తెలియజేశారు. ఆయనింకా ఇలా వక్కాణించారు.

యుద్ధమే గనుక వస్తే ప్రజాస్వామిక స్వతంత్ర దేశాలకువ్యతిరేకంగా శత్రు పక్షాన ఇండియా చేరదని నా నమ్మకం.

స్టేట్ మంత్రులతో సమావేశం

హయిద్రాబాద్, జూన్ 21

ఆంధ్ర ఆర్థికమంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు, హయిద్రాబాద్ రాష్ట్రాలికముఖ్యమంత్రి శ్రీ డి.జి. బింధూ,ఆర్థికమంత్రి శ్రీవినాయకరావు విద్యాలంకార్ మరియు ప్లానింగు మంత్రి డా॥ చెన్నారెడ్డిగారిని నిన్న కలిశారు

వారు తొలుత నిర్ణయించుకున్న ప్రకారం కర్నూలుకు వెళ్ళకుండా నిన్నరాత్రిపైలులో నాల్తేరుకుబయలుదేరారు. నాల్తేరులో వీరి నన్నిహితబంధువు అనారోగ్యంగా ఉన్నట్లునన్న సమాచారం అందినదని తెలియుచున్నది. (యు.పి.ఐ.)

స్టాక్ ఎక్స్ఛేంజి ఫెడరేషన్

హయిద్రాబాద్, జూన్ 21

హయిద్రాబాద్ స్టేట్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ ముకుందదాస్ మోహతాలాల్ మలాని హయిద్రాబాద్ స్టాక్ ఎక్స్ఛేంజీల ఫెడరేషన్‌కు ప్రతినిధిత్వమును వహించుటకు దాని తాలూకు డైరెక్టర్‌లలో ఒకరుగా ఎన్నికైనారు.

కనీనవేతనముల సలహాబోర్డు పక్షమున ఫెడరేషన్‌కు ప్రతినిధియగుటకు శ్రీ యస్.వి. నాయక్ ఎన్నికైనారు.

గోదాములకు కాంట్రాక్టు పద్ధతి

హమాలీల ఆందోళన

హయిద్రాబాద్, జూన్ 21

హమాలీల యూనియన్ అధ్యక్షులు శ్రీ ఎస్. నారాయణ్ నేడు ప్రభుత్వం వారు హయిదరాబాద్, వరంగల్, కేంద్ర గోదాములలో ఏర్పాటు చేయబడుతున్న కాంట్రాక్టు పద్ధతిని నిరసించారు.

హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని హమాలీలుమాత్రమే 2000 దాకా వున్నారు.

ఇప్పుడు మూడవమనిషినిఅనవసరంగా కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టడంద్వారా హమాలీలను చాల మందిని పనిలోండి తీసివేయవలసి వస్తుందనే ఆందోళనను శ్రీ నారాయణ, రీజనల్ డైరెక్టర్(ఫుడ్),దక్షిణ ప్రాంతం, మద్రాసు వారికి తెలియబర్చారు. ఈ మూడవమనిషి తన బాగోగుల కొరకు కూలీలను ఉపయోగించుకొంటాడు. ఇందువల్ల ప్రభుత్వం సహకార సంస్థల ఉద్దేశాలను వ్యతిరేకిస్తోన్నట్లుపుతున్నది. ఈ కాంట్రాక్టు పద్ధతిద్వారా మధ్యన మూడవ మనిషిని భాగువరుస్తూ మిగిలినవిషయాల్లో చాల నష్టాలను తెచ్చిపెట్టినట్లు అవుతుందని కూడా శ్రీ నారాయణ్ అన్నారు. (ఎ.ఎన్.ఎస్)

ఉస్మానియా పరిశీలక సంఘ సమావేశం

జూలై 3 న హైద్రాబాద్‌లో జరుగుతుందని అధ్యక్షుని ప్రకటన

కర్నూలు, జూన్ 19

ఉస్మానియా విశ్వవిద్యాలయ భవితవ్యతానిర్ణయం సందర్భంలో భారత ప్రభుత్వంనియమించిన పరిశీలకసంఘం జూలై 3వ తేదీన హైద్రాబాద్‌లో తొలిసమావేశం జరుపుతుందని ఆసంఘ అధ్యక్షుడు అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ అయిన డా॥ జకీర్ హుస్సేన్ అన్నారు.

నేడు యిక్కడికివచ్చిన డా॥జకీర్ హుస్సేన్ ఈసంఘాన్నినియమించి ఒక సంవత్సరం అయినా ఇంతవరకది సమావేశం కాలేదన్నారు.

తొలి సమావేశంలోఆకమిటీ విచారణ విధానం నిర్ణయించబడుతుంది. సాక్ష్యమేమైనా సేకరించాలా అనే విషయంకూడ ఆసమావేశంలో నిర్ణయిస్తారని ఆయన చెప్పారు.

ఉస్మానియా దక్షిణదేశాన కంతటికీ కేంద్ర విశ్వవిద్యాలయంగా ఉండాలా? లేక ఒక రాష్ట్రానికి చెందిన విశ్వవిద్యాలయంగా ఉండాలా అనే విషయాన్ని పరిశీలించడానికి ఈకమిటీ నియమించబడింది. ఇది కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించుకోవలసిన విషయమని డా॥ హుస్సేన్ అన్నారు.

ఈకమిటీకి మొదట అధ్యక్షుడుగా నియమించబడిన సోషలిస్టు నాయకుడు ఆచార్య నరేంద్రదేవ్ రాజీనామా యివ్వగా డా॥ హుస్సేన్ యిప్పుడు నియమించబడ్డాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ డా॥ సూరి భగవంతంగారు ఈ కమిటీకి కార్యదర్శి.

మెండస్ ఫ్రాన్స్ మంత్రివర్గం

అన్ని రాజకీయపక్షాలకు ప్రాతినిధ్యం

ప్యారిస్, జూన్ 21

గత ద్వితీయ ప్రపంచ యుద్ధంనాటి నుండి ఇప్పటివరకుపందొమ్మిదిమంత్రి వర్గాలు ఫ్రాన్సులో పడిపోయినవి. మెండస్ ఫ్రాన్సుయొక్క మంత్రి వర్గం 20 వది.

పూర్వపు సాంప్రదాయాలకు విరుద్ధంగా మెండస్ ఫ్రాన్స్ తనమంత్రివర్గ సభ్యుల అన్ని పార్టీలవారినుండి తీసుకొన్నారు. ఇతనికి ఓటు చేసినపార్టీల ప్రతినిధుల మాత్రమే తీసుకోనలేదు. ఇతని మంత్రివర్గంలో అన్ని పార్టీలకు ప్రాతినిధ్యమున్నది. క్రిశ్చియన్ డెమోక్రాటిక్ పార్టీకిచెందిన ఇద్దరుసభ్యులు మాత్రం వ్యక్తిగత హోదాలోమంత్రి వర్గంలో చేరినారని ప్రకటించినారు.

మెండస్‌ఫ్రాన్స్ విదేశాంగశాఖను తానే చేపట్టాడు. (యు. పి. ఐ

తూర్పు పాకిస్థాన్‌లో సైనిక ప్రభుత్వం

హిందూమహాసభ అధ్యక్షులు ఎన్. సి. చటర్జీ వివరణ

ఇందోర్, జూన్ 20

తూర్పు బెంగాల్‌లో ఫజుల్‌హక్ మంత్రివర్గం బర్తరఫ్ అతర్వాత అక్కడకలిగిన పరిణామాలు ఆసియాలో ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించ గలమని అమెరికాచేసే ప్రకటనలలో అంతరార్థం ఎట్టిదో స్పష్టంచేస్తున్నవని అఖిల భారత హిందూమహాసభ అధ్యక్షులు ఎన్. సి. చటర్జీ ప్రకటించారు.

గాంధీహాలులో మధ్యభారత్ హిందూమహాసభ సమావేశాన్ని ప్రారంభిస్తూ శ్రీ చటర్జీ పై విధంగా ప్రకటించారు.

"అమెరికా కొరియాలో ప్రజాస్వామిక ఎన్నికలు జరుగాలని ఉభయ కొరియాలు విభక్తంకావాలని ప్రకటిస్తున్నది. కాని తూర్పుబెంగాల్‌లో పశ్చిమపాకిస్థాన్ అధికారులు చేస్తున్నపని ఏమిటి? తొంబదివంతుల ప్రజ తూర్పు బెంగాల్‌లో లీగ్‌మంత్రివర్గాన్ని వ్యతిరేకించినది. అధికారంనుండి పడగొట్టినది. కాని జరిగినదేమిటి ప్రజాస్వామికమగు హక్ పరిపాలనకు బదులుగా సైనికప్రభుత్వం విస్వరచబడినది. అమెరికానుండి లభిస్తున్న సైనిక సహాయం బలంతోనే ముస్లింలీగ్ నాయకులు నిర్దాక్షిణ్యమయిన ఈదుర్చర్యకు కడంగినారు. తూర్పు పాకిస్థాన్‌లో సరిగా వ్యవహరింప వలసినదిగా పాకిస్థాన్ ప్రభుత్వమునకు ఐసెన్‌హోవర్ చెప్పవలెను. ముస్లింలీగ్‌పై తూర్పుబెంగాల్‌లో ప్రజావిశ్వాసం నశించగా దానిని తిరిగి అధికారంలోపెట్టడానికి బాయొనెట్లచూపి బెదరించడం జరుగుతున్నది. ఆర్థికంగా పరిపాలనా విషయంగా దోచబడటాన్ని తూర్పు పాకిస్థాన్ ప్రజలు ఎన్నాళ్ళు సహింపగలరు. అందువల్లనే పశ్చిమపాకిస్థాన్ డామినేషనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. యు. పి. ఐ.

ఆడ పహిల్వాన్‌ల మల్లయుద్ధపోటీ

రష్యావస్తాదుపై హమిదాబాను విజయం

బొంబాయి, జూన్ 20

నేటి సాయంత్రం వల్లభాయి పటేల్ స్టేడియంలోజరిగిన హమిదాబాను, వీరాచిస్టిలిన్‌అనే ఆడపహిల్వాన్‌ల మల్లయుద్ధపోటీలో భారతమహిళా చాంపియన్‌పహిల్వాన్ హమిదాబాను ఒక్కనిముషంలో రష్యా ఆడపహిల్వాన్ వీరాచిస్టిలిన్‌నుఓడించింది.

రష్య ఆడఎలుగుబంటిగా అడ్వర్టైజ్డ్ చేయబడిన వీరాచిస్టిలిన్ మల్లయుద్ధప్రవీణురాలువలె కనబడినదికాని అలీఘర్ ఆడపహిల్వాన్ హమిదాబానుధాటికి నిలవలేకపోయింది.

వాణిజ్యపరిశ్రమలశాఖ

రిజిస్ట్రారు పదవి రద్దుపరచబడింది. ఈ ఉత్తరువు వెంటనే అమలుకు రాగలదు.

వాడవేళ్ళవ్యాపారాలు

గుబ్బాబుచ్చయ్యగారి వెంకటేశం కమీషన్ ఏజంటు

(కల్లూరు రేట్లు)

హైద్రాబాద్ 21-6-1954

120 శేర్ల వల్లాఒక్కంటికి	
పప్పు	120-0-0 160-0-0
పెసళ్ళు	25-0-0 26-0-0
జొన్నలు బియ్యం	38-0-0 47-0-0
సెంబల్లు	42-8-0 46-0-0
సాంబల్లు	51-0-0 56-0-0
గోధుమలు	53-0-0 58-0-0
కందులు పెద్దవి	23-0-0 24-0-0
కందులు చిన్నవి	19-0-0 20-0-0
సెనగలు	28-4-0 28-8-0
ఉలువలు	21-8-0 22-8-0
బెల్లం	46